



# ప్రజావీక్షణం

దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్


PJV
ప్రజా వీక్షణం టీవి
Subscribe

www.prajaveekshanam.in సంపుటి:16 సంచిక :245 30 గురువారం, జులై 2026 పేజీలు : 08 వెల:రూ.2/-

Published from : Vijayawada, Krishna, Guntur, Kakinada, Vishakhapatnam, Vijayanagaram, Prakasham, Kadapa, Kurnool, Tirupathi, Anantapur, East Godavari, West Godavari

## బంగాళాఖాతంలో మునిగిపోయిన వారు చేసే వ్యాఖ్యలు

- ఎల్‌నినోతో ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను మళ్లిస్తున్నాం
- హైడ్రాపై కెటిఆర్ వ్యాఖ్యలకు మంత్రి తుమ్మల కౌంటర్

హైదరాబాద్,జూలై29( ప్రజా విక్షణం ):

హైడ్రాపై మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. బంగాళా ఖాతంలో మునిగిపోయిన వాళ్లే హైడ్రాను బంగాళాఖాతంలో వేస్తామంటే అర్థం లేదంటూ సెటైర్ విసిరారు. వర్షాకాలం వచ్చినా ఇప్పటికీ 30 శాతం లోటు వర్ష పాతం నమోదైందని తెలిపారు. 150 ఏళ్ల నుంచి చూడని ప్రకృతి వైపరీత్యం వచ్చిందన్నారు. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్‌లో కూడా తీవ్ర ఎల్‌నినో ప్రభావం ఉంటుందని చెప్పుకొచ్చారు. ...మిగతా 2 లో...



## సర్ ప్రక్రియలో చురుకుగా పాల్గొనండి

- కాంగ్రెస్ బిఎల్ఎలకు భట్టి ఆదేశం

న్యూఢిల్లీ,జూలై29( ప్రజా విక్షణం ):

ప్రత్యేక సమగ్ర సవరణ పక్రియను కాంగ్రెస్ బీఎల్ఏలు వేగవంతం చేయాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు చేరువ చేసేందుకు యాక్షన్ ఎలాన్ సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. ఎమ్మెల్సీ గ్రాడ్యుయేషన్ ఎలక్షన్‌పై జిల్లా ఇన్‌చార్జ్, జిల్లా పీసీసీలతో చర్చించి ముగ్గురు సభ్యులతో ప్యానల్ ఏర్పాటు చేసి నివేదిక అందించాల్సి ఉంటుందని తెలిపారు. ...మిగతా 2 లో...



## గణనీయంగా చెరకు విస్తీర్ణం పెంపు

- ఉత్పాదక సామర్థ్యం మెరుగు పర్చాలి
- చక్కెర పరిశ్రమల పునరుద్ధరణ కమిటీతో సిఎస్ చర్చలు

హైదరాబాద్,జూలై29( ప్రజా విక్షణం ):

రాష్ట్రంలో చెరకు పంట విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచడంతో పాటు చక్కెర పరిశ్రమల పునరుద్ధరణ, వాటి ఉత్పాదక సామర్థ్యాన్ని మరింత మెరుగుపరిచేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో షుగర్ పరిశ్రమల పునరుద్ధరణ, చెరకు పంట విస్తీర్ణం పెంపు కోసం ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ. నెం. 86 ప్రకారం ఏర్పాటు చేసిన కమిటీ సమావేశం గురువారం సచివాలయం లో ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన జరిగింది.

...మిగతా 2 లో...



## యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

- వాడీవేడీ చర్చ అనంతరం మూజువాణి ఓటుతో ఆమోదం
- విపక్షాల సవరణలను తిరస్కరించిన ప్రభుత్వం
- పార్లమెంటరీ వ్యవహారాలపై రాహుల్‌కు అవగాహన లేదన్న జితేంద్ర సింగ్
- బిల్లు ఆమోదంతో లోక్‌సభ నేటికి వాయిదా

న్యూఢిల్లీ,జూలై29( ప్రజా విక్షణం ):

వాడీవేడీ చర్చలు..విమర్శలు ప్రతివిమర్శలు, ఆక్షేపణల మధ్య పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. చర్చల అనంతరం బిల్లును మూజువాణి ఓటుతో సభ ఆమోదించింది. బిల్లులో మార్పులు చేయాలంటూ విపక్షాలు ప్రతిపాదించిన సవరణలను ప్రభుత్వం తిరస్కరించింది. పశ్నపత్రాల లీకేజీ, పరీక్షల్లో అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకునేలా ఈ బిల్లులో నిబంధనలు పొందుపరిచారు. దేశవ్యాప్తంగా పోటీ పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంచడం, అభ్యర్థుల ప్రయోజనాల ను కాపాడడమే బిల్లు లక్ష్యమని ప్రభుత్వం తెలిపింది. ఈ యాంటీ పేపర్ లీక్ బిల్లు ఆమోదం అనంతరం లోక్‌సభ సమావేశాలను స్పీకర్ ఓం బిర్లా గురువారానికి వాయిదా వేశారు. కాగా పేపర్ లీక్ కేసుల్లో దోషులకు పదేళ్ల వరకు జైలు శిక్ష, రూ. 10 కోట్ల వరకు జరిమానా విధించేలా ఈ బిల్లును రూపొందించారు. ఇదివరకు 3-5 ఏళ్ల జైలు శిక్ష, రూ. 10లక్షల వరకు జరిమానా ఉండేది. ...మిగతా 2 లో...

## వందేమాతరం బిల్లుకు రాజ్యసభ ఆమోదం

- అధికార పార్టీ తీరుకు నిరసనగా విపక్షాల వాకౌట్

న్యూఢిల్లీ,జూలై29( ప్రజా విక్షణం ):

జాతీయ గేయం వందేమాతరంపై బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందింది. ఈ బిల్లును కేంద్ర మంత్రి నిత్యానంద రాయ్ ఈ నెల 24న ప్రవేశపెట్టారు. వందేమాతరాన్ని అవమానించినా, ఆలపిస్తుండగా ఆటంకం కలిగించినా నేరంగా పరిగణించేలా చట్టం చేయనున్నారు. వందేమాతరం బిల్లులో భాగంగా ది ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్ టు నేషనల్ ఆనర్-1971లో సవరణలు చేయాలని కేంద్రం ప్రతిపాదించింది. ప్రస్తుతం జాతీయ గీతమైన జనగణమనకు ఉన్న చట్టపరమైన రక్షణను వందేమాతరానికీ వర్తింపజేయడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశం. బిల్లుపై సభలో చర్చ ప్రారంభం కాగానే ప్రతిపక్ష నేతలు భారీ ఎత్తున నినాదాలు చేశారు.

...మిగతా 2 లో...

## రేవంత్, కిషన్ రెడ్డి కారణంగా సింగరేణి అస్తిత్వం ప్రమాదంలో పడింది...

- సింగరేణికే బొగ్గు బ్లాకులు కేటాయించాలనే విన్నపాలను పట్టించుకోవడం లేదన్న కవిత
- టీఎస్ జెన్‌కోను రంగంలోకి దింపడం వెనుక మర్మం ఏమిటని ప్రశ్న
- ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు డ్రామా ఆడుతున్నారని విమర్శ




ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిల తీరు వల్ల తెలంగాణకే గర్వకారణమైన సింగరేణి సంస్థ తన అస్తిత్వాన్ని, ఉనికిని కోల్పోయే ప్రమాదంలో పడిందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బహిరంగ వేలం ద్వారా కాకుండా నేరుగా సింగరేణి సంస్థకే బొగ్గు బ్లాకులను కేటాయించాలన్న విజ్ఞప్తులను పట్టించుకోకుండా... మణుగూరు పీకేవోసీపీ బొగ్గు బ్లాక్ వేలం నిర్వహించడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని ఆమె ఆరోపించారు.సింగరేణి నేరుగా వేలంలో పాల్గొంటుందని పైకి ప్రకటించిన ప్రభుత్వం, తెరవెనుక మాత్రం టీఎస్ జెన్‌కోను పోటీలోకి తెచ్చేలా కుట్రపూరిత ప్రయత్నాలు చేస్తోందని కవిత మండిపడ్డారు. బొగ్గు తవ్వకాల్లో శతాబ్దాల అనుభవం, ప్రావీణ్యం ఉన్న సింగరేణి సంస్థకు పోటీగా.. ఎలాంటి అనుభవం లేని టీఎస్ జెన్‌కోను రేసులోకి దింపడం వెనుక ఉన్న మర్మమేమిటో రేవంత్ రెడ్డి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

...మిగతా 2 లో...

## పేపర్ లీక్ నిరోధక బిల్లుపై వాడీవేడీ చర్చ...

- రాహుల్ ఈడియట్ పదంపై సభలో గందరగోళం
- తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన అధికార పార్టీ ఎంపిలు
- ఢిల్లీ వీధుల్లో జరిగింది నిరసన కాదు... భావ వ్యక్తీకరణ
- పేపర్ లీక్‌పై బిజెపి ఎంపిల పిల్లలనే అడగండి చెబుతారు
- యాంటీ పేపర్ లీక్ బిల్లుపై చర్చలు రాహుల్ విమర్శలు



న్యూఢిల్లీ,జూలై29( ప్రజా విక్షణం ):

లోక్‌సభలో విపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి. విద్యార్థుల ఆందోళనపై లోక్‌సభలో ప్రసంగించిన ఆయన.. ఆర్ఎస్ఎస్, కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ సమయంలో ఆయన ఉపయోగించిన ఓ పదంపై తీవ్ర దుమారం రేగింది. రాహుల్ వ్యాఖ్యలపై భాజపా ఎంపీలు అభ్యంతరం వ్యక్తం చేశారు పబ్లిక్ ఎగ్జామినేషన్స్‌లో అక్రమాల నిరోధానికి చట్టాన్ని సవరిస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లుపై లోక్‌సభలో బుధవారం కూడా వాడీవేడి చర్చ కొనసాగించింది. ఈ చర్చలో భాగంగా రాహుల్ గాంధీ ప్రసంగిస్తూ.. విద్యార్థుల ఆందోళన విషయంలో కేంద్రం తీరుపై విమర్శలు గుప్పించారు. యువత ఆందోళనను దేశ ప్రజలు అర్థం చేసుకున్నారు. ...మిగతా 2 లో...



## పులుల సంరక్షణ మన బాధ్యత

- భూమ్మీద జీవించే హక్కు సమస్త జీవరాశులది
- అంతర్జాతీయ పులుల దినోత్సవ కార్యక్రమంలో మంత్రి సురేఖ

హైదరాబాద్,జూలై29( ప్రజా విక్షణం ):

పులుల సంరక్షణ పట్ల సమాజంలోని అన్ని వర్గాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. ఈ భూమి కేవలం మనుషుల ఆవాసం మాత్రమే కాదని, సమస్త జీవరాశుల ఉమ్మడి నివాసం అని గుర్తించి ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు రావాలని కోరారు. అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించు కుని మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా దూలపల్లిలోని తెలంగాణ స్టేట్ ఫారెస్ట్ అకాడమీలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను మంత్రి పరిశీలించారు. పులుల సంరక్షణకు సంబంధించిన లఘు చిత్రాన్ని మంత్రి వీక్షించారు.

...మిగతా 2 లో...

## నేరచరిత్ర గొడ్డలి పార్టీ నేతది

అమరావతి,జూలై29( ప్రజా విక్షణం ):

**అందులో చేరిన వారంతా నేర చరితులే సాక్ష్యాలను తారుమారు చేసిన వ్యక్తికి పరామర్శలా ఏం మెజేస్ ఇద్దామని పరామర్శలకు వెళతారు జగన్ తీరుపై మండిపడ్డ సిఎం చంద్ర బాబు**

వ్యవస్థలు నిర్మాణం చేద్దామనే సంకల్పంతో ఎవరైనా రాజకీయాల్లోకి వస్తారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. కానీ వ్యవస్థల్ని నాశనం చేయటమే లక్ష్యంగా గొడ్డలి పార్టీ అధినేత ఉన్నారంటూ వైఎస్ జగన్‌పై ఆయన మండిపడ్డారు. బుధవారం వెలగపూడిలోని సచివాలయంలో అందుబాటులో ఉన్న పార్టీ నేతలతో సీఎం చంద్రబాబు సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా తాజా పరిణామాలపై వారు చర్చించారు. శ్రీకాకుళం జైలులో ఉన్న వైసీపీ నేత, మాజీ మంత్రి సిదిరి అప్పలరాజును గురువారం మాజీ సీఎం వైఎస్ జగన్ పరామర్శించనున్నారనే విషయాన్ని సీఎం దృష్టికి పార్టీ నేతలు తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో ఆయన స్పందించారు. వ్యవస్థల నిర్మాణం చేసే వాళ్లు చట్టాలను గౌరవిస్తూ వాటికి లోబడి నడుచుకుంటారని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.



# సంపాదకీయం

## పరీక్షల బిల్లుతో సమస్య సమిసిపోయేనా?

పిల్లికి చెలగాటం...ఎలుకకు ప్రాణ సంకటం అన్నట్లుగా మన పరీక్షల విధానం మారింది. ఇటీవల నీట్ ప్రవేశ పరీక్షల లీక్‌తో మన పరీక్షల విధానం ఎంత డొల్లగా ఉందో తేలిపోయింది. డబ్బులకు కక్కుర్తి పడే లెక్చరర్లు ఉండడం దౌర్భాగ్యం. విద్యార్థులు ఏమైతేనేమీ మనకు కాసులు రాలుతున్నాయని పేపర్లను లీక్ చేస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవలి నీట్ పేపర్ లీక్‌తో కాక్రోచ్ పార్టీ ఉద్యమించడం, అంతే స్పీడ్‌గా ఇప్పుడు పార్లమెంటులో పేపర్ లీక్ నిరోధక బిల్లుపై చర్చ సాగుతోంది. ఈ చర్చలో గమనించిన విషయమేమిటంటే విపక్షాలకు కూడా పకడ్బందీ విధానం ఎలా అమలు చేయాలన్న దానిపై అవగాహన లేదని తేలిపోయింది. చర్చలో పాల్గొన్న ప్రియాంక గాంధీ, రాహుల్ గాంధీ, గగోయ్, అఖిలేశ్ యాదవ్‌లు విమర్శలు చేశారే తప్ప పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అసవరమైన సూచనలు చేయలేక పోయారు. కాక్రచ్ ఉద్యమాన్ని ముందుకేసుకుని ప్రభుత్వాన్ని తూర్పారాబట్టడం మాత్రమే చేస్తున్నారు. పరీక్షలను ఎలా పకడ్బందీగా ఎలా నిర్వహించాలో నిర్మాణాత్మక సూచనలు చేయలేదు. ప్రభుత్వం కూడా ఎంతసేపు శిక్షలపైనే దృష్టి పెట్టింది తప్ప, పరీక్షలను పక్కాగా నిర్వహించడం ఎలా అన్నదానిపై దృష్టి సారించడం లేదు. నిజంగానే ఆదరాబాదరాగా తెచ్చిన ఈ బిల్లులో కఠిన శిక్షలతో పాటు, పరీక్షలను సంస్కరించే విధంగా నిబంధనలు పొందుపర్చాలి. నీట్ పరీక్ష పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చింది. అయితే మంత్రి రాజీనామాతోనే భ్రష్టుపట్టిన మన దేశ విద్యా వ్యవస్థ మారిపోదు. పరీక్ష పేపర్ లీకేజీలు, అవకతవకలు, అవినీతి వంటి సమస్యలు తొలగిపోవాటంలే పరీక్షల విధానంలో మార్పులు రావాలి. ఎందుకంటే పేపర్ లీకేజీలకు మూలం డబ్బుల మాయగా ఉంది. ఈజీగా డబ్బు సంపాదించే క్రమంలో ఇలాంటి దురాగతాలకు పాల్పడుతున్నారు. మెడికల్ కాలేజీల ప్రవేశానికి లక్షల మంది రాసే పరీక్షను నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ చట్టబద్ధతను సమీక్షించాలి. వాస్తవానికి ఎన్టీఏ అనేది ఒక అకడమిక్ బాడీ కూడా కాదని ఎంతమందికి తెలుసు. ప్రజాస్వామ్యబద్ధంగా ఏర్పాటైన సంస్థ అంతకన్నా కాదు. కేవలం కేంద్ర ప్రభుత్వ నియామక సంస్థ మాత్రమే అని ఇక్కడ గుర్తించాలి. దానికంటూ స్వతంత్రత, స్వయంప్రతిపత్తి ఏమీ లేవు. అలాంటి సంస్థకు దేశంలోని నీట్‌తో సహా అనేక ప్రవేశ పరీక్షలను, పోటీ పరీక్షలను నిర్వహించే బాధ్యతను ప్రభుత్వం అప్పగించింది. ఈ కారణంగా దేశ విద్యారంగాన్నంతా కేంద్ర ప్రభుత్వం అధీనంలోకి తెచ్చుకునే అధికారాల కేంద్రీకరణ విధానం. అందువల్లనే పరీక్షలలో అక్రమాలు, అవకతవకలు, అవినీతి వ్యవహారాలు సాగుతున్నాయి. నీట్ కోచింగ్ సెంటర్స్‌ను నిర్వహిస్తున్న వారే నీట్ పేపర్ సెట్టర్స్‌గా అవతారమెత్తారంటే ఎన్టీఏ కేంద్రంగా కోచింగ్ మాఫియా ఏ స్థాయిలో బలంగా వేళ్లూనుకుందో చెప్పవచ్చు. ఈ విధమైన వేల కోట్ల రూపాయల అవినీతి వ్యాపారం సాగుతుఓంది. అధికారుల అండదండలు లేకుండా ఇది జరు9గుతందని అనుకోవడానికి లేదు. అందువల్ల ఈ ఎన్టీఎ స్థానంలో ప్రస్తుతం బిల్లు ఏ ర కంగా ఉంటుందో తెలియదు. పార్లమెంటులో చర్చ సాగుతున్నా సీరియస్‌నెస్ కానరావడం లేదు. బిల్లులో కేంద్రాన్ని విమర్శించడం తప్ప నిర్మాణాత్మక సూచనలు చేయడంలో విపక్ష పార్టీలు విఫలం అయ్యాయి. కావున ఎన్టీఏ ఉనికిని, దాని చుట్టూ బలంగా అల్లుకొని ఉన్న అవినీతి చట్రాన్ని బ్రద్దలు కొట్టాలి. లేదంటే కంటితుడుపు చర్యగా పేపర్ లీకేజీలో దళారి పాత్ర పోషించిన కొద్దిమంది నేరస్తులను బలి ఇవ్వడం, ఎన్టీఏలోని కొద్దిమంది అధికారులను తొలగించడం వంటి కసరత్తుగా మిగిలి పోతుంది. ఇంత ఆగ్రహం, ఆందోళన చెలరేగిన నేపథ్యంలో అసమర్థ ఎన్టీఏను రద్దుచేసి, తిరిగి రాష్ట్రాల స్థాయిలోనే మెడికల్ అడ్మిషన్స్‌కు ప్రవేశ పరీక్ష నిర్వహించాలనే డిమాండ్ ను కూడా పునఃపరిశీలించడం అవసరం. ఉమ్మడి జాబితాలోని విద్యపై రాష్ట్రాల హక్కులను హరిస్తున్న, రాజ్యాంగ ఫెడరల్ సూత్రాలను కాలరాస్తున్న విద్యా కేంద్రీకరణ విధానానికి అడ్డుకట్ట వేయడం సాధ్యమవుతుంది. పేపర్ లీకేజి సమస్య అనేది నేడు కొత్తగా తలెత్తినది కాదు. గతంలో కూడా మెడికల్, ఇంజినీరింగ్, వంటి కోర్సులకు రాష్ట్రాల స్థాయిలో నిర్వహించిన ప్రవేశ పరీక్షలలోనూ అక్రమాలు, అవకతవకలు, లీకేజీలు చోటుచేసుకున్నాయి. చదువులంటే మెడికల్, ఇంజినీరింగ్, కంప్యూటర్, బిజినెస్ మేనేజ్‌మెంట్, సరికొత్తగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లర్నింగ్ కోర్సులు అన్న భావన బలపడి పోయింది. జేఈఈ, నీట్ పరీక్షలలో మంచి ర్యాంకులు పొందడమే మహా యజ్ఞమైంది. మిగతావన్నీ కొరగానివిగా, అర్భకుల చదువులుగా భావించే అపోహ బలపడ్డాయి. ఇదే అదనుగా కోచింగ్ సెంటర్లు పుట్టుకు వచ్చాయి. కోటళల్లో వ్యాపారాలు సాగుతున్నాయి. ప్రభుత్వాలు విద్యను ఒక వ్యాపార సరుకుగా మార్చేశాయి. ప్రైవేట్ రంగం విజృంభించడానికి ఇలాంటి నీట్ పరీక్షల విధానాలు కూడా ఓ కారణంగా చూడాలి. దీనికితోడు సమాజంలో నిరుద్యోగం, ఉపాధి లేమి అంతకంతకూ పెరుగుతుండడంతో పిల్లల భవిష్యత్తు యెడల అంతులేని అభద్రతాభావం తల్లిదండ్రులను వెంటాడుతోంది. ఈ పరిస్థితులే కార్పొరేట్ విద్యకు, కోట్ల వ్యాపారానికి, కోచింగ్ సెంటర్ల మాఫియా ముఠాలకు కేంద్రాలుగా మారాయి. పిల్లల చదువులు, వారి భవిష్యత్తు పట్ల సమాజంలో ఎంతో ఆసక్తి, ఆందోళన నెలకొన్న నేపథ్యంలో ఒక బలమైన ప్రజా ఉద్యమం ద్వారానే మన దేశ విద్యా వ్యవస్థను మార్చడం సాధ్యమవుతుంది. కొత్తగా తీసుకుని వస్తున్న బిల్లు వల్ల మంచి ఫలితాలు వస్తాయని చెప్పడానికి లేదు. లీకులకు అలవాటు పడ్డవారు ఎలాంటి శిక్షలకైనా తెగిస్తారు. కోర్టుల్లో బెయిల్ పొందడం వంటి వెసలుబాట్లను ఉపయోగించుకుంటారు. అందువల్ల సమగ్ర విద్యావిధానంపై చర్చించి, విద్యారంగాన్ని బలోపేతం చేసే చర్యలకు నడుంబిగించాలి. కనీసం విపక్షాలయినా ఈ బిల్లు సందర్భంలో ప్రమాణాలపై చర్చివుంటే బాగుంటుంది.

## బంగాళాఖాతంలో మునిగిపోయిన వారు చేసే వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి

ప్రకృతి వైపరీత్యాన్ని గ్రామగ్రామాన ప్రజలకు తెలియజేస్తున్నామని తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో పని చేస్తున్నామన్నారు. రైతులు మెట్ట పంటలు వేస్తున్నారని మంత్రి తెలిపారు. ఆయిల్ పామ్ వైపు ఎక్కువగా రైతులు మొగ్గుచూపుతున్నారని, ఇది మంచి శుభపరిణామమని అన్నారు. గాంధీ భవన్‌ను దేవాలయంగా భావించి నమ్మకంతో ప్రజలు సమస్యలు చెప్పుకోవడానికి వస్తున్నారన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పంపిస్తున్నామని తెలిపారు. ఏ పార్టీ నిర్వహించని ముఖాముఖిని కాంగ్రెస్ నిర్వహిస్తోందన్నారు. కలెక్టర్లతో మాట్లాడి సమస్యలను పరిష్కారం చేస్తున్నామని చెప్పారు. సంబంధిత శాఖ అధికారులకు పంపిస్తూ రిపోర్ట్ అడుగుతున్నామన్నారు. ముఖాముఖి నిర్వహిస్తున్న పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధన్యవాదాలు తెలియజేశారు.

## సర్ ప్రక్రియలో చురుకుగా పాల్గొనండి

మొదటిపేజీ తరువాయి

బీఎల్‌ఏలు బాగా పనిచేస్తున్నారని అభినందించారు. ఏఐసీసీ కార్యాలయంలో తెలంగాణ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం ఈరోజు జరిగిందని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సర్‌పై రివ్యూ చేశామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. 36 వేల మంది బీఎల్‌ఏలను నియమించినట్లు చెప్పారు. 50-60 శాతం ఈ పక్రియ పూర్తయిందని వెల్లడించారు. రెండు, మూడు రోజుల్లో 100 శాతం పూర్తవుతుందని వివరించారు. అర్హతగల ఓటర్ల ఓటు హక్కు కాపాడటం తమ లక్ష్యమని వ్యాఖ్యానించారు. ఈసారి ఞాఎఖీ పక్రియ దురుద్దేశంతో జరుగుతుందని చెప్పారు. ఓట్లను కాపాడే ఉద్దేశంతో ఈ సమావేశంలో చర్చించామని తెలిపారు. సంస్థాగత బలోపేతం, పార్టీ ప్రభుత్వ సమన్వయంపై మాట్లాడామని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. కాగా, ఢిల్లీ ఇందిరా భవన్‌లో తెలంగాణ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ , మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , సీతక్క , సీడబ్ల్యూసీ సభ్యులు మంత్రి దామోదర్ రాజానర్సింహ, వంశీచంద్ పాల్గొన్నారు. ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. తెలంగాణలో ఎస్ఐఆర్ పక్రియ, పార్టీ - ప్రభుత్వం మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడంపై ప్రధానంగా చర్చించారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఏర్పాటు చేసిన కోఆర్డినేషన్ కమిటీ పనితీరు, ఇప్పటివరకు తీసుకున్న నిర్ణయాల అమలుపై సమీక్షించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పార్టీ కార్యక్రమాల సమన్వయం, ప్రజలకు చేరువ చేసే కార్యాచరణపై మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు, సంస్థాగత బలోపేతం, రాజకీయ పరిస్థితులపై కూడా సమావేశంలో చర్చించినట్లు సమాచారం.

## గణనీయంగా చెరకు విస్తీర్ణం పెంపు

మొదటిపేజీ తరువాయి

సమావేశంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, చెరకు రైతు ప్రతినిధులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం 12 చక్కెర కర్మాగారాలు ఉండగా ప్రస్తుతం 7 కర్మాగారాలు మాత్రమే పనిచేస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం పనిచేస్తున్న పరిశ్రమలు పూర్తి సామర్థ్యంతో పనిచేయాలంటే ఏటా సుమారు 50 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు అవసరమవుతుందని, ప్రస్తుతం రాష్ట్రంలో కేవలం 20 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు మాత్రమే ఉత్పత్తి అవుతోందని వివరించారు. రి పంటతో పోలిస్తే చెరకు సాగుకు తక్కువ నీరు అవసరమవుతుందని, డ్రిప్ ఇరిగేషన్ వంటి ఆధునిక సాగు పద్ధతులను అవలంబిస్తే దిగుబడులు పెరగడంతో పాటు సాగు వ్యయం కూడా తగ్గుతుందని పేర్కొన్నారు. 2026?27 వ్యవసాయ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 19 వేల మంది రైతులు 26 వేల హెక్టార్లలో చెరకు సాగు చేస్తున్నట్లు తెలిపారు. చెరకు సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు, చక్కెర పరిశ్రమలకు అవసరమైన ముడి చెరకు లభ్యతను మెరుగుపరచేందుకు ఇతర రాష్టాల్లో అమలు చేస్తున్న ప్రోత్సాహకాలు, విధానాలను సమగ్రంగా అధ్యయనం చేసి నివేదికను తక్షణమే సమర్పించాలని అధికారులను ప్రధాన కార్యదర్శి ఆదేశించారు.మావేశంలో రైతు ప్రతినిధులు మాట్లాడుతూ, చెరకు రైతులకు కూడా వరి రైతులకు అందిస్తున్న తరహాలో టన్నుకు రూ.500 ప్రోత్సాహకం అందించాలని కోరారు. చెరకు సాగులో అధిక పెట్టుబడి, వ్యవసాయ కూలీల కొరత రైతులకు ప్రధాన సవాళ్లుగా మారాయని వివరించారు. చెరకు ద్వారా చక్కెరతో పాటు ఇథనాల్, విద్యుత్ ఉత్పత్తి కూడా సాధ్యమవుతుందని పేర్కొంటూ, ఈ రంగానికి మరింత ప్రోత్సాహం అందించాలని విజ్ఞప్తి చేశారు.

## రేవంత్, కిషన్ రెడ్డి కారణంగా సింగరేణి అస్తిత్వం ప్రమాదంలో పడింది...

మొదటిపేజీ తరువాయి

జెన్‌కో ద్వారా బొగ్గు బ్లాకులను దక్కించుకుని, ఆ తర్వాత అనుభవం లేదనే నెపంతో వాటిని ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు ఈ ముసుగు డ్రామా ఆడుతున్నారని ఆమె ధ్వజమెత్తారు. సింగరేణి భవిష్యత్తు, అభివృద్ధిపై కిషన్ రెడ్డికి నిజంగానే చిత్తశుద్ధి ఉంటే, వేలం ప్రక్రియతో సంబంధం లేకుండా నేరుగా కేటాయింపులు జరపాలని డిమాండ్ చేశారు. వెంటనే ఈ వేలం పోటీ నుంచి టీఎస్ జెన్‌కోను రాష్ట్ర ప్రభుత్వం తప్పించాలని డిమాండ్ చేశారు.

## వందేమాతరం బిల్లుకు రాజ్యసభ ఆమోదం

మొదటిపేజీ తరువాయి

ఇటీవల ఢిల్లీలో విద్యార్థులపై పోలీసులు బలప్రయోగం చేశారని... దీనిపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభకు వచ్చి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. చర్చలో పాల్గొనాలని సభ్యులను డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ పదే పదే కోరినప్పటికీ ఆందోళనలు విరమించలేదు. కేంద్ర సహాయ మంత్రి రాందాస్ అథవాలె బిల్లుపై మాట్లాడుతున్న సమయంలో ప్రతిపక్ష సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. వందేమాతరాన్ని అవమానించడాన్ని నేరంగా పరిగణించి, దోషులకు గరిష్ఠంగా మూడేళ్ల జైలు శిక్ష విధించేలా ఈ బిల్లులో నిబంధనలు రూపొందించారు.

## పులుల సంరక్షణ మన బాధ్యత

మొదటిపేజీ తరువాయి

కార్యక్రమంలో అటవీదళాల ప్రధాన సంరక్షణాధికారి వినయ్ కుమార్, కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్ లర్ దండా రాజిరెడ్డి, పిసిసిఎఫ్ (డెవలప్ మెంట్) రత్నాకర్ జౌహరి, సిసిఎఫ్ టిజిఎస్ఎఫ్ఎ డైరక్టర్ ప్రియాంక వర్గీస్, సిసిఎఫ్ ఎన్ క్షితిజ, టైగర్ సెల్ రీసర్చ్ సైంటిస్ట్ అయాన్ సాధు, అమ్రాబాద్ ఫీల్డ్ డైరెక్టర్ ప్రసాద్, కవాల్ టైగర్ రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్ శాంతారాం పలువురు అటవీశాఖ అధికారులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ సభను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రతి సంవత్సరం జూలై 29న ప్రపంచ పులుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. పులుల సంరక్షణ ప్రాధాన్యతపై ప్రపంచవ్యాప్తంగా అవగాహన పెంపొందించేందుకు 2010లో రష్యాలోని సెయింట్ పీటర్స్ బర్గ్ లో ప్రారంభమైన ఈ కార్యక్రమం నేడు ప్రకృతి పరిరక్షణకు ఒక గొప్ప వేదికగా నిలిచిందన్నారు. పులి అటవీ సంపదకు ప్రతీక అని, పులిని పరిరక్షించడమంటే అడవిని, పర్యావరణాన్ని, జీవవైవిధ్యాన్ని, భావితరాల భవిష్యత్తును పరిరక్షించడమేనని అన్నారు. అటవీ సంపద, వన్య ప్రాణుల సంరక్షణలో విశేష కృషి చేసిన పలువురు అటవీ శాఖ ఉద్యోగులకు ప్రశాంస పత్రం తో పాటు, నగదు బహుమతిని మంత్రి సురేఖ అందించారు. అదే విధంగా అంతర్జాతీయ పులుల సంరక్షణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన చిత్రాలేఖన పోటీలో గెలిచిన విద్యార్థులకు మంత్రి సురేఖ ప్రశంసా పత్రాలు, బహుమతులు అందించారు.

## పేపర్ లీక్ నిరోధక బిల్లుపై వాడీవేడీ చర్చ...

మొదటిపేజీ తరువాయి

వారి సెంటిమెంట్‌ను అన్ని పార్టీలు గౌరవించాయి. ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో ఉన్న విద్యార్థులు పేపర్ లీక్ వంటి ఘటనలతో ఆందోళనకు గురయ్యారు. తీవ్ర వేదన తర్వాతే దిల్లీ వేదికగా నిరసనలు చేపట్టారు. శాంతియుత నిరసన చేస్తున్న వారిని రెచ్చగొట్టేలా పోలీసులు ప్రవర్తించారు. ఆందోళన చేసిన వారితో నేను మాట్లాడాను. వారు చెప్పిన మాటలు నన్ను కదిలించాయి. మూర్ఖులు ఎవరి మాటలు వినరని విద్యార్థులు నాతో చెప్పారు. ప్రభుత్వంలో ఉన్నవాళ్లు తమ ఆవేదనను పట్టించుకోవడం లేదని బాధపడ్డారని రాహుల్ వ్యాఖ్యానించారు. అయితే, రాహుల్ ప్రసంగంపై భాజపా ఎంపీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలో అభ్యంతరకర మాటలు మాట్లాడుతున్నారని, విద్యార్థుల పేరు చెప్పి ఎంపీలను అవమానిస్తున్నారని మండిపడ్డారు. వాటిని రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. దీంతో కేంద్రం, విపక్ష నేత మధ్య ఒకింత వాగ్వాదం నెలకొంది. దీంతో స్పీకర్ దాన్ని తొలగించారు. చదువు అనేది ప్రస్తుతం ఖరీదైన వ్యాపారంగా మారింది. విద్యార్థుల కోసం నేడు తల్లిదండ్రులు లక్షలు ఖర్చుపెడుతు న్నారు. కానీ, విద్యావ్యవస్థ క్రూరంగా మారింది. ప్రైవేటీకరణ విచ్చలవిడిగా జరుగుతోంది. ఇక, ఈ వ్యవస్థ నడిపిస్తోంది ఆర్ఎస్ఎస్. ధర్మేంద్ర ప్రధాన్ కేవలం సింబల్ మాత్రమే. విద్యార్థులకు అసలైన శత్రువు ఈ సంస్థే. ఆర్ఎస్ఎస్ నుంచి వచ్చిన వాళ్లకే ప్రభుత్వంలో ప్రాధాన్యత ఉంటోంది. . రాహుల్ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని కిరణ్ రిజిజు డిమాండ్ చేశారు. దీంతో ప్రతిపక్ష నేత వ్యాఖ్యలను స్పీకర్ రికార్డుల నుంచి తొలగించారు.బీజేపీ ఎంపీల వ్యాఖ్యలపై రాహుల్ మాట్లాడుతూ.. 'నేను దఎంపీలను విమర్శించలేదు. బీజేపీ ఎంపీలు కావాలనే నా ప్రసంగాన్ని అడ్డుకుంటున్నారు. సభలో కేవలం బీజేపీ ఎంపీలే మాట్లాడాలనడం సరికాదు' అంటూ రాహుల్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## నేరచరిత్ర గొడ్డలి పార్టీ నేతది

మొదటిపేజీ తరువాయి

కానీ గొడ్డలి పార్టీ నేతలకు చట్టాలంటే గౌరవం లేదన్నారు. గొర్రెల కాపరి చనిపోతే సాక్ష్యాలు తారుమారు చేసి ఇంకొకరి జీవితాన్ని బలి చేద్దామనుకున్న వారిని పరామర్శించడం ద్వారా సమాజానికి ఏం మెసేజ్ ఇస్తారంటూ వైసీపీ అధినేత తీరును ఎండగట్టారు. గతంలో కారు చక్రాల కింద వ్యక్తి నలిగిపోతే కనీసం అతడిని ఆసుపత్రికి తీసుకెళ్దామనే మానవత్వం కూడా గొడ్డలి పార్టీ అధినేతకు లేదని అన్నారు. పుట్టిన రోజులకు గొడ్డళ్లతో జంతు బలులు చేసి రాక్షసానందం పొందే హింసా ప్రవృత్తి ఆ పార్టీదని ఆయన అభివర్ణించారు. నేరాల నియంత్రణకు 2014-19 మధ్య రాష్ట్రవ్యాప్తంగా 15 వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. అయితే 2019-24 మధ్య వాటికి మెయింటెనెన్స్ లేకపోవడంతో అవి నిర్వీర్యం అయ్యాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే.. వాటన్నింటినీ పునరుద్ధరించటంతో నేరస్తుల్ని సాక్ష్యాలతో సహా పట్టుకోగలుగుతున్నామని వివరించారు. రోడ్డు ప్రమాదంలో పాస్టర్ ప్రవీణ్ చనిపోతే.. దానిని హత్యగా చిత్రీకరించి రాజకీయంగా ప్రభుత్వంపై బురద చల్లాలని చూశారని వైసీపీ నేతల తీరును ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. సీసీ టీవీ ఆధారాలు అన్నీ బయటపెట్టే సరికి తోక ముడిచారంటూ ఆ పార్టీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నేర ప్రవృత్తి కలిగిన వారు తాము నేరం చేసి.. దానిని ఎదుటి వారిపై రుద్దాలని చూస్తారని వ్యాఖ్యానించారు. ఆలాంటి వారంతా గొడ్డలి పార్టీలోనే ఉన్నారని పేర్కొన్నారు. గంజాయి బ్యాచ్‌లను వెంటేసుకుని నేరస్తుల్ని పరామర్శించటమే పనిగా గొడ్డలి పార్టీ అధినేత వైఎస్ జగన్ చేస్తున్నారని చంద్రబాబు విమర్శించారు. నేరప్రవృత్తి కలిగిన వారు తాము నేరం చేసి ఎదుటివారిపై రుద్దాలని చూస్తారు. అలాంటి వారంతా గొడ్డలి పార్టీలోనే ఉన్నారు. గంజాయి బ్యాచ్‌లను వెంటేసుకుని నేరస్థుల్ని పరామర్శించడమే గొడ్డలి పార్టీ పనిగా పెట్టుకుంది' అని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

## యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

మొదటిపేజీ తరువాయి

అదే వ్యవస్థీకృత నేరాల్లో అయితే 5-10 ఏళ్ల జైలు శిక్ష, రూ.కోటి వరకు జరిమానా ఉంది. విపక్షాలు పలు సవరణలు కోరినప్పటికీ.. అవి వీగిపోయాయి. పేపర్ లీక్‌లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించి బిల్లులో నిబంధనలు రూపొందించామని తెలిపింది. ఈ బిల్లుపై చర్చలో భాగంగా ఆయా పార్టీల సభ్యులు మాట్లాడిన అనంతరం.. చివరగా కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. పార్లమెంటరీ వ్యవహారాలపై రాహుల్‌కు అవగాహన లేదని, ప్రభుత్వం ఎలా నడుస్తుందో ఆయనకు తెలియదని మండిపడ్డారు. 2024లో యాంటీ పేపర్ లీక్ చట్టం అమల్లోకి వచ్చినప్పటి నుంచి 52 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని పేర్కొన్నారు. నీట్ పేపర్ లీకైన వెంటనే ప్రభుత్వం వేగంగా స్పందించిందని, అనుభవాల నుంచి నేర్చుకునేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందనడానికి పేపర్ లీక్ నిరోధక సవరణ బిల్లు నిదర్శనమన్నారు. యాంటీ-పేపర్ లీక్ బిల్లుపై లోక్‌సభలో చర్చ జరగకుండా ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించారు. చర్చ మధ్యలో సంబంధం లేని అంశాలను ప్రస్తావిస్తూ.. అసలు విషయం నుంచి దృష్టిని మళ్లించడానికి ప్రయత్నిస్తున్నార న్నారు. విద్యార్థుల సంక్షేమం, భద్రత కోసమే ఈ బిల్లు తీసుకువచ్చినట్లు తెలిపారు. పరీక్షా విధానంపై ఏమైనా సూచనలు ఉంటే ఇవ్వాలని ప్రతిపక్షాలను కోరారు. సభలో మాట్లాడేటప్పుడు సభ్యతతో కూడిన భాషను ఉపయోగించాలని సూచించారు. రాహుల్, ప్రియాంక, అఖజలేశ్, గొగోయ్ తదితరులు బిల్లుపై మాట్లాడారు.

ప్రజావీక్షణం దినపత్రిక
GENERAL NEWS
30 గురువారం, జులై 2026
3
www.prajaveekshanam.in

# రేవంత్ నిన్ను కోడంగల్ లో గెలవనియ్యా





**దేవరకద్ర కోటపై బీసీ జెండా ఎగరేస్తా..!**

**అగ్రవర్ణ రాజకీయాల కౌంట్‌డౌన్ మొదలైంది..**

**సర్జికల్ స్ట్రైక్ 59" దేవరకద్ర నుండే మొదలు**

**తర్వాత 58 జూపల్లి కృష్ణారావే**

**2028లో బీసీలదే అధికారం**

**మేము ఎర్ర సత్యమన్న వారసులం**

**బీసీలకు బీ-ఫారాలు ఇచ్చే ఏకైక పార్టీ టీఆర్పీ**

**కాంగ్రెస్,బిఆర్ఎస్,బీజేపీ పార్టీల బిఫామ్ లు ఇగ చిత్తుకాగితాలే**

**నా ప్రచార పుణ్యమా అని నువ్వు ఎమ్మెల్యే అయినవ్**

**జిమ్మెర్ నీకు ఇదే ఆఖరి గెలుపు,నీ కాంధాన్ అంతా ఒక్కటైనా నీ బొచ్చలో ఓట్లు పడవు**

**16,416 ఎకరాల భూములను దేవరకద్ర పేదలకు పంపిణీ చేస్తా**

**సెప్టెంబర్ 17 నుంచి రాజ్యాధికార పాదయాత్ర చేస్తా**

**రెడ్లు,వెలమల దోపిడి ప్రతి ఇంటికి వివరిస్తా**

దేవరకద్ర, జూలై 29 ప్రజా విక్షణం

తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో బుధవారం స్థానిక శ్రీనివాస ఫంక్షన్ హాల్లో నిర్వహించిన బహిరంగ సభ రాజకీయంగా హాట్ టాపిక్‌గా మారింది. పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సమక్షంలో దేవరకద్రకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రఘువీర వర్మ ముదిరాజ్ తన అనుచరులతో కలిసి తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరారు. వారికి మల్లన్న పార్టీ కండువా కప్పి ఘనంగా ఆహ్వానించారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి మాట్లాడిన పార్టీ చీఫ్ తీన్మార్ మల్లన్న, దేవరకద్ర గడ్డపై ఇక రెడ్ల పెత్తనం సాగదని స్పష్టం చేశారు. ఈ నియోజకవర్గంలో మెజారిటీగా ఉన్న బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు రాజకీయంగా మేల్కొన్నారని, దేవర కద్రతో పాటు తెలంగాణ రాజకీయాలే మారనున్నాయని అన్నారు. బురదలో చిక్కుకున్న ఏనుగుకు తన శక్తిని గుర్తు చేసిన వెంటనే అది బయటపడిన కథను ప్రస్తావిస్తూ, అదే పరిస్థితి నేడు బీసీలదని చెప్పారు. జనాభాలో మెజారిటీగా ఉన్నా తమ రాజకీయ బలాన్ని గుర్తించకపోవడం వల్లే అధికారం కొద్దిమంది చేతుల్లోకి వెళ్లిందన్నారు. ఇకపై బీసీలు తమ ఓటును తమ రాజ్యాధికారం కోసం వినియోగించాలని పిలుపునిచ్చారు. దేవరకద్రలో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ఓట్లు సుమారు 11 వేల వరకు మాత్రమే ఉన్నాయని, కేవలం 11,000 రెడ్డి ఓట్లు ఉంటే, ముది రాజుల ఓట్లు 52,000 ఉన్నాయని లెక్కలు చెప్పారు. 47 వెలమ ఓట్లు, 11 వేల రెడ్డి ఓట్లు కలిపినా మన 2.30 లక్షల మంది బీసీ,ఎస్సీ, ఎస్టీ,మైనారిటీ ఓట్ల ముందు అవి ఎందుకూ పనికిరావని ఎద్దేవా చేశారు. "మీ రెడ్డి, వెలమ ఓట్లు మాకు వద్దు, పొరపాటున కూడా మాకు వేయకండి" అని బహిరంగంగా సవాల్ విసిరారు. గత ఎన్నికల్లో మధుసూదన్ రెడ్డి, ఆళ్ళ వెంకటేశ్వర్ రెడ్డి, పవన్ కుమార్ రెడ్డి, సంతోష్ రెడ్డిలే నిలబడ్డారని,రెడ్ల ఓట్లు వీరికి పంచితే ఒక్కొక్కరికి 3000 ఓట్లు కూడా రావని ఎద్దేవా చేశారు. బీజేపీలో ఉన్న బాలన్న, కాంగ్రెస్ లో ఉన్న యూఎంఆర్ వెంకటేష్ వంటి బీసీ నేతలు కేవలం జెండాలు మోయడానికే తప్ప, ఆ పార్టీలు వారికి బీ-ఫామ్ ఇవ్వవని, కేవలం తెలంగాణ రాజ్యాధికార పార్టీ మాత్రమే బీసీలకు బీ-ఫామ్ ఇస్తుందని స్పష్టం చేశారు.మరోవైపు ముదిరాజ్ తో పాటు ఇతర బీసీ వర్గాలు, ఎస్సీ, ఎస్టీలు కలిపి లక్షలాది ఓట్లు ఉన్నప్పటికీ అధికారానికి దూరంగా ఉండటం రాజకీయ మోసానికి నిదర్శనమన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డిని ఉద్దేశించి మాట్లాడుతూ, దేవరకద్ర ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, రానున్న ఎన్నికల్లో బీసీ బిడ్డనే అసెంబ్లీకి పంపుతారని ధీమా వ్యక్తం చేశారు.తాను ప్రచారం చేసి ఉండకపోతే జిమ్మెర్ అసలు గెలిచేవాడే కాదని అన్నారు.రాబోయే ఎన్నికల్లో జిమ్మెర్ కి 10వేల ఓట్లు కూడా రానియ్యనని,దేవరకద్ర కోటపై బీసీ జెండా ఎగరేస్తామని ధీమా వ్యక్తం చేశారు. 1949లో నిజాం జారీ చేసిన ఫర్మానాను ప్రస్తావిస్తూ, అమరచింత సంస్థాన పరిధిలో సాగు చేస్తున్న పేదలకు చెందాల్సిన 16,416 ఎకరాల భూమిని కొందరు రెడ్లు అనుభవిస్తున్నారని ఆరోపించారు. టీఆర్పీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆ భూములను స్వాధీనం చేసుకుని భూమిలేని బీసీ, ఎస్సీ, ఎస్టీ, పేద కుటుంబాలకు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని ప్రాజెక్టులు, సంస్థలకు ప్రజల కోసం పోరాడిన పండుగ సాయన్న,ఎర్ర సత్యం ముదిరాజ్ లాంటి మహనీయుల పేర్లు పెట్టాలని, స్థానిక చరిత్రకు, ఉద్యమాలకు గౌరవం దక్కేలా ప్రభుత్వం వ్యవహరించాలని డిమాండ్ చేశారు.బీసీలంతా ఒక్కటై జంగుసైరం మోగిస్తున్నారని,బీసీ ఉద్యోగులు,మహిళలు,రైతులు,విద్యార్థులు,జర్నలిస్టులు,యువకులు అంతా ఒక్కటై బీసీ రాజ్యాధికార నినాదం ఎత్తుకున్నారని అన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల బి-ఫారాలకు విలువ ఉండదని మల్లన్న ఎద్దేవా చేశారు. గాంధీ భవన్ ముందు కాంగ్రెస్ బి-ఫారాలు పెట్టినా, లేదా బీఆర్ఎస్ ఒక బి-ఫారం కొంటే ఒకటి ఫ్రీ అని ఆఫర్ ఇచ్చినా తీసుకునే నాథుడు ఉండడని, ఎందుకంటే ఆ పార్టీలకు ఓట్లు ఉండవని అన్నారు. రేవంత్ రెడ్డికి గతంలో కొడంగల్‌లో దిక్కులేకపోయిందని, 2018లో అక్కడ ఓడిపోయి మల్కాజ్‌గిరికి బొచ్చే పట్టుకొని వెళ్తే ప్రజలు ఆడో మెతుకు ఈడో మెతుకు వేస్తే ఆ మెతుకులతో గెలిచి బయటపడ్డాడని మల్లన్న మండిపడ్డారు.పిడికెడు మంది లేని రేవంత్ రెడ్డి సామాజిక వర్గం వారు, రాష్ట్రంలో మెజారిటీగా ఉన్న బీసీలకు పెట్టేదేమిటని ఆయన ప్రశ్నించారు. తెలంగాణలోని బీసీలంతా తిన్న తర్వాత చేతులు కడుక్కుంటే రాలే మెతుకులు కూడా రేవంత్ రెడ్డి గ్రూపుకు ఎక్కువే అవుతాయని ఎద్దేవా చేశారు.గతంలో తాను లొల్లి పెట్టి పోరాడబట్టే శ్రీహరి గారికి మంత్రి పదవి వచ్చిందని, బీసీలకు ఏదో ఊరికే రాలేదని ఆయన పేర్కొన్నారు. నల్లమల పులి అని రేవంత్ రెడ్డి,కావలి కుక్క అని కేసీఆర్ చెప్పి ప్రజలను నిలువును దోచుకున్నారని, ఇగ ఈ జంతువులతో మనకు పనిలేదని,వాటిని తన్ని తరిమికొట్టడానికి తెలంగాణ రాజ్యాధికార పార్టీని తీసుకొచ్చానని అన్నారు. తాను కాంగ్రెస్ బీ-ఫారంపై ఎమ్మెల్సీగా గెలిచానంటూ రాజీనామా కోరుతున్నవారికి సమాధానంగా, ముందు తన ప్రచార మద్దతుతో గెలిచిన 42 మంది రెడ్డి ఎమ్మెల్యేలందరూ రాజీనామా చేయాలని తర్వాత తాను రాజీనామా చేస్తానని ప్రతి సవాల్ విసిరారు. 2028 ఎన్నికలే తెలంగాణ భవిష్యత్తును నిర్ణయించే ఎన్నికలని పేర్కొన్న మల్లన్న, రాష్ట్రంలో తొలి బీసీ ముఖ్యమంత్రి నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పాటు చేయడమే తమ లక్ష్యమన్నారు. ప్రతి బీసీ కుటుంబానికి కనీసం రెండు ఎకరాల భూమి అందించే దిశగా విధానాలు రూపొందిస్తామని ఆయన తెలిపారు. సెప్టెంబర్ 17 నుంచి ప్రారంభమయ్యే రాజ్యాధికార పాదయాత్ర ద్వారా ప్రతి గ్రామానికి వెళ్లి రెడ్లు,వెలమల దోపిడి ప్రతి ఇంటికి వివరించి రాజకీయ చైతన్యం కల్పిస్తామని, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ఐక్యతతో అగ్రవర్ణ రెడ్డి, వెలమ రాజకీయ ఆధిపత్యానికి ముగింపు పలుకుతామని ప్రకటించారు. తెలంగాణలో రాజ్యాధికారం బీసీ ప్రజల చేతుల్లోకి వచ్చే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేములవాడ మదన్ మోహన్ చారీ,జిల్లా అధ్యక్షులు మున్నూరు జైపాల్ రెడ్డి,రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బంధారపు నర్సయ్య గౌడ్,రాష్ట్ర కార్యదర్శి శివ వీర్ రెడ్డి,కొమ్ముల ప్రవీణ్ రాజ్,సహాయ కార్యదర్శి రవి ముదిరాజ్,వనపర్తి జిల్లా అధ్యక్షులు విజయ్,నాగర్ కర్నూలు జిల్లా అధ్యక్షులు బీసం ఆంజనేయులు, గద్వాల్ జిల్లా అధ్యక్షులు మెరుగు వీరేష్,నారాయణపేట జిల్లా అధ్యక్షులు కృష్ణ,మైనారిటీ విభాగం అధ్యక్షుడు సల్మాన్,స్టేట్ ఆఫీస్ కో ఆర్డినేటర్ లింగం యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రఘు వర్మ, నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు అధ్యక్షులు రాయుడు, పట్టణ అధ్యక్షులు నిరంజన్, జిల్లా, నియోజకవర్గ,మండలాల నాయకులు,మహిళా కార్యకర్తలు మరియు మల్లన్న అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## దేవరకద్ర టీయూడబ్ల్యూజే (హెచ్-143) మండల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక..

దేవరకద్ర జూలై 29 ప్రజా విక్షణం

టీయూడబ్ల్యూజే (హెచ్-143) మహబూబ్‌నగర్ జిల్లా అడ్‌హక్ కమిటీ ఆధ్వర్యంలో దేవరకద్ర మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.జిల్లా అడ్‌హక్ కమిటీ కన్వీనర్ వరంగల్ శివకుమార్, కో-కన్వీనర్ చింతకాయల వెంకటేష్, బుధవారం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మండల కమిటీని ప్రకటించారు.నూతన కమిటీ పదవులు.. అధ్యక్షుడు -- వేపూరి చంద్రశేఖర్ ప్రధాన కార్యదర్శి -- మల్లికార్జున్ ఉపాధ్యక్షుడు -- ప్రణేష్ చారి సంయుక్త కార్యదర్శి నరేష్ ప్రచార కార్యదర్శి రఘువీర్ కుమార్ కార్యనిర్వాహక సభ్యులు.. షఫీ, ఎల్లస్వామి, రాజశేఖర్, రమేష్, గోపనపల్లి శ్రీనివాస్, సంతోష్, పి. శ్రీనివాస్, సారంగపాణి, రాజేందర్ గౌడ్. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు పెద్దంగారి రవికుమార్తో పాటు పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.అంతకుముందు ముందు అడ్‌హక్ కమిటీ ఆధ్వర్యంలో భూత్పూర్ మండల సభ్యులకు యూనియన్ సభ్యత్వ కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన దేవరకద్ర మండల కమిటీకి అడ్‌హక్ కమిటీ నాయకులు అభినందనలు తెలియజేస్తూ, పాత్రికేయుల హక్కుల పరిరక్షణకు, సంఘ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు.





## పంచాయతీ కార్యదర్శులు అంకిత భావంతో పని చేయండి..

### జిల్లా అదనపు కలెక్టర్ మధుసూద నాయక్

దేవరకద్ర జులై 29 ప్రజా విక్షణం

వివిధ గ్రామాల్లో ఉన్న పంచాయతీ కార్యదర్శులు అంకితభావంతో పనిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ మధు సుదన్ నాయక్ కోరారు. దేవరకద్ర మండల కేంద్రంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు వివో ఏలకు సమావేశం నిర్వహించారు. గ్రామాలలో గ్రామ అభివృద్ధి కోసం పంచాయతీ కార్యదర్శులు నిరంతరంగా కృషి చేయాల్సిన బాధ్యత ఎంతైనా ఉన్నది అని ఆయన అన్నారు. గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు కూడా అందుబాటులో ఉండాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంపీవో ఏపీవో ఏపీఎం తదితరు పాల్గొన్నారు.





## కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలను చైతన్యపరచాలి

### తెదేపా రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గొర్రెల శ్రీధర్

తాడేపల్లిగూడెం ప్రతినిధి జులై 29

(ప్రజా వీక్షణం)

కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై ప్రజలను చైతన్యపరచాలని తెదేపా రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గొర్రెల శ్రీధర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తెదేపా నియోజకవర్గ ఇంచార్జ్ వలవల మల్లిఖార్జునరావు (బాబ్జి) ఆదేశాల మేరకు క్లస్టర్-10, బూత్, యూనిట్, క్లస్టర్ ఇంచార్జ్ ల సమావేశాన్ని ఆయన అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గొర్రెల శ్రీధర్ మాట్లాడుతూ రెండేళ్ల పాలనలో అభివృద్ధి -- సంక్షేమం కార్యక్రమంలో భాగంగా నిర్వహించే ఇంటింటి సర్వేపై ప్రతి కార్యకర్త పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రతి ఇంటిని సందర్శించి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని తెలియజేశారు. సర్వే నిర్వహణలో ఏవైనా సందేహాలు, ఇబ్బందులు ఎదురైతే వెంటనే పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకురావాలని సూచించారు. పార్టీ ప్రతిష్ఠను పెంచేలా క్రమశిక్షణతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టైలర్స్ ఫెడరేషన్ చైర్మన్ ఆకాశపు స్వామి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య సంఘ కార్పొరేషన్ డైరెక్టర్ పద్మనాభుని మురళి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ సబ్నీవీసు కృష్ణమోహన్, పట్టణ అధ్యక్షుడు పట్నాల రాంపండు, జిల్లా నాయకుడు గురుజు సూరిబాబు, మాజీ కౌన్సిలర్లు కొల్లి రమావతి, కాకర్ల సుభద్ర,




ఈదుపల్లి వాసు, తెలుగు యువత పట్టణ అధ్యక్షుడు ఎరుబండి సతీష్, షేక్ హాజీ, పసలపూడి రాంబాబు, దాట్ల జగన్నాథరాజు, ఉల్లింగుల చిన్న, దొడ్ల బాలాజీ, షరీఫ్, దలై తిరుమల రావు, ధూసనపూడి కృష్ణప్రసాద్, రంజిత్, పైలా శివకృష్ణ, గంధం గిరి, షేక్ హసీన్, భోజంకి శ్రీనివాస్, బేతిరెడ్డి భాస్కరరెడ్డి, రాము, భీము, సనపతి త్రిమూర్తులు, పాలూరి బాలుసులు, పట్టపు నాగశ్రీను, సలాది శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గురు పూర్ణిమ వేడుకలు..



దేవరకద్ర జూలై 29 ప్రజావిక్షణం

మండల కేంద్రంలో బుధవారం గురుపౌర్ణమి వేడుకలు షిరిడి సాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. స్థానిక ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో షిరిడి సాయిబాబా విగ్రహానికి భక్తులు ప్రత్యేకంగా అభిషేకం నిర్వహించారు. అర్చకులు సంజీవ చారి, స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి పట్టు వస్త్రలతో పూలతో అలంకరణ చేశారు . తదుపరి భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొండ శ్రీనివాస్ రెడ్డి, బాలరాజు, రాము,షిరిడి సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజావీక్షణం
దినపత్రిక

## శ్రీ శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి సన్నిధిలో ఘనంగా అన్న సమారాధన

**ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడెం:జులై 29(ప్రజా వీక్షణం)**

స్థానిక అశ్వరావుపేట రోడ్డులోని హైస్కూల్ వద్ద వేంచేసియున్న శ్రీ శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి సన్నిధిలో ప్రతి బుధవారం నిర్వహిస్తున్న భారీ అన్న సమారాధన కార్యక్రమం అత్యంత వైభవంగా కొనసాగుతోంది. భగవంతుని అనుగ్రహంతో ఈ వారం నిర్వహించిన అన్నప్రసాద వితరణ విశేషంగా ఆకట్టుకుంది. ఈరోజు జరిగిన అన్నప్రసాద వితరణలో పలువురు భక్తులు తమ కుటుంబ సభ్యుల జ్ఞాపకార్థం మరియు జన్మదిన వేడుకల సందర్భంగా విరాళాలు అందజేశారు. కానూరి సత్యనారాయణమ్మ మనవరాలు హైమావతి పుట్టినరోజును పురస్కరించుకుని, అలాగే ఎం. రమాదేవి, నందూరి ఈశ్వరి, చలంచర్ల సత్యనారాయణ కుమారుడు మరియు కోడలు పేరున, మరియు పేరిచర్ల జగపతి రాజు ప్రత్యేక సహకారంతో ఈరోజు సుమారు 1000 మందికి పైగా భక్తులకు మహా అన్నప్రసాదం కడుపునిండా అందించడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీ వరసిద్ధి వినాయక నిస్వార్థ స్వచ్ఛంద సేవ అన్న ప్రసాద వితరణ కమిటీ వారు మాట్లాడుతూ.. అన్నప్రసాద వితరణకు విరాళాలు వచ్చినా, రాకపోయినా, కొంత మాత్రమే అందినా, లేదా ఎంత ఖర్చయినా మిగిలిన వ్యయాన్ని కమిటీ సభ్యులందరం కలిసి భరించి ఈ సత్కార్యాన్ని విజయవంతంగా ముందుకు నడిపిస్తున్నట్లు తెలిపారు. నెలవారీగా దాదాపు 7,000 నుండి 10,000 మందికి స్వామివారి అన్నప్రసాదాన్ని అందించే మహా అదృష్టాన్ని భగవంతుడు తమకు ప్రసాదించారని, ఇది తమ కుటుంబాలు గత జన్మలో చేసుకున్న అదృష్టంగా మరియు పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్లు వారు ఆనందం వ్యక్తం చేశారు.





## డాక్టర్ వై.ఎస్.ఆర్. ఉద్యాన విశ్వ విద్యాలయానికి జాతీయ స్థాయిలో అత్యున్నత గుర్తింపు

**'నేషనల్ గ్రీన్ యూనివర్సిటీ ర్యాంకింగ్ 2026లో దేశంలో 16వ ర్యాంకు**

**వర్శిటీ ఉప కులపతి డాక్టర్ దనుంజయరావుకి వెల్లువెత్తిన అభినందనలు**

**తాడేపల్లిగూడెం ప్రతినిది జులై 29 (ప్రజా వీక్షణం)**

తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలోని డా. వై.ఎస్.ఆర్. ఉద్యాన విశ్వవిద్యాలయం జాతీయ స్థాయిలో అత్యున్నత గుర్తింపును దక్కించుకుంది. గ్రీన్ మెంటార్స్ సంస్థ నిర్వహించిన 'నేషనల్ గ్రీన్ యూనివర్సిటీ ర్యాంకింగ్ 2026' లో దేశంలో 16వ ర్యాంకును సాధించింది. మొత్తం 100 మార్కులకు గాను 92.0 స్కోరు సాధించి, 'గోల్డ్ రేటింగ్ కైవసం చేసుకుంది. పర్యావరణ నిర్వహణ, క్యాంపస్ జీవవైవిధ్యం, హరిత మౌలిక వసతులు, సౌరశక్తి ఉపయోగం, నీటి సంరక్షణ, వ్యర్థాల నిర్వహణ మరియు సుస్థిర పరిశోధనలు వంటి 10 కీలక అంశాలను పరిగణలోకి తీసుకుని ర్యాంకును కేటాయించారు. జాతీయ స్థాయి గుర్తింపుతో పాటు, అమెరికాలోని న్యూయార్క్‌లో జరగనున్న అంతర్జాతీయ '10వ ఎన్‌వైసీ గ్రీన్ స్కూల్ కాన్ఫరెన్స్ 2026' సదస్సులో పాల్గొనడానికి మరియు అంతర్జాతీయ వేదికపై పురస్కారాన్ని అందుకోవడానికి విశ్వవిద్యాలయానికి ప్రత్యేక ఆహ్వానం లభించింది. ఈ సదస్సులో ప్రపంచవ్యాప్త విద్యావేత్తలు, పర్యావరణ నిపుణుల సమక్షంలో విశ్వ విద్యాలయాన్ని ఘనంగా సత్కరించనున్నారు. ప్రతిష్టాత్మక సర్టిఫికేట్, డిజిటల్ బ్యాడ్జ్‌తో పాటు, అంతర్జాతీయ పర్యావరణ పరిశోధనలు, భాగస్వామ్యాలకు ఈ పురస్కారం కొత్త మార్గాలను సుగమం చేయనుంది. విశ్వ విద్యాలయం ఇంతటి ఘన విజయాన్ని దక్కించుకోవటంతో వర్శిటీ అధికారులు, అధ్యాపకులు, శాస్త్రవేత్తలు, నాన్-టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు విశ్వ విద్యాలయం ఉప కులపతి డాక్టర్ కె.దనుంజయరావుని కలిసి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా గౌరవనీయ ఉపకులపతి డాక్టర్ కె. ధనుంజయ రావు మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం 2020, ఐక్యరాజ్యసమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా విద్యాబోధనతో పర్యావరణ సంరక్షణను మేళవించడంలో మన విశ్వ విద్యాలయం ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. ఈ ప్రతిష్టాత్మక అవార్డు మన బాధ్యతను మరింత పెంచిందని, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్‌ఏ2047 ఉన్నతాశయాలను సాధించే దిశగా ఎంతగానో ప్రోత్సాహిస్తోందని తెలిపారు. సుస్థిరమైన, పర్యావరణహితమైన ఉద్యాన సాంకేతికతలను, వినూత్న పరిశోధనలను రైతులకు చేరువ చేస్తూ, వ్యవసాయ రంగానికి, రైతాంగ సంక్షేమానికి సమగ్ర సేవలు అందించడానికి ఈ పురస్కారం నిరంతర స్ఫూర్తినిస్తుందని ఉప కులపతి డాక్టర్ దనుంజయరావు తెలియజేయడం విశేషం.



# ఉద్యాన విశ్వవిద్యాలయం కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం



**ఎఐటియుసి నాయకులు హామీ**

**తాడేపల్లిగూడెం ప్రతినిధి జులై 29 (ప్రజా వీక్షణం)**

డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ సిబ్బంది సమస్యలను సంబంధిత అధికారులు , ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్తామని, అవసరమైతే కార్మికశాఖకు నివేదిస్తామని ఎఐటియుసి నాయకులు హామీ ఇచ్చారు. తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలోని డా. వై.ఎస్.ఆర్. హార్టికల్చర్ యూనివర్సిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశాన్ని వర్సిటీ ప్రాంగణం వద్ద బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యూనియన్ అధ్యక్షుడు కోటుం నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. సోమసుందర్ మాట్లాడుతూ రాష్ట్రంలో పలు విభాగాల్లో చిరకాలంగా కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ విధానం అమలులో ఉందని, వారికి ఎంత సర్వీసు ఉన్నా పర్మనెంట్ కాకపోగా కనీస వేతనం లభించడం లేదన్నారు. ఇచ్చే తక్కువ వేతనాలు కూడా నెలల తరబడి బకాయిలు పెడుతున్నారని అన్నారు. ఉద్యాన విశ్వ విద్యాలయంలో గతంలో ఆప్ కాస్ లో ఉన్న కొంతమంది సిబ్బందిని కాంట్రాక్ట్ సిబ్బందిగా మార్చడంతో వారి వేతనాలు తగ్గిపోవడం బాధాకరమని అన్నారు. సిబ్బంది సమస్యల పరిష్కారానికి ఎఐటియుసి కృషి చేస్తుందని వివరించారు. ఎఐటియుసి తాడేపల్లిగూడెం ఏరియా సమితి అధ్యక్షుడు ఓసూరి వీర్రాజు మాట్లాడుతూ యూనివర్సిటీ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ సిబ్బంది యూనియన్ ఏర్పాటు చేసుకోవడం, రిజిస్ట్రేషన్ చేయించుకోవడం అభినందనీయమని , సమస్యల పరిష్కారం కోసం సంఘటితంగా ప్రయత్నం చేద్దామని, అవసరమైతే ఉద్యమించడానికి సిద్ధం కావాలన్నారు. ఏరియా సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కళింగ లక్ష్మణరావు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా హార్టికల్చర్ యూనివర్సిటీ లోని కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ సిబ్బందిలో కొందరికి గతం కంటే వేతనాలు తగ్గిపోవడం విడ్డూరంగా ఉందన్నారు. జీతాలు పెంచకపోగా తగ్గించడం చట్ట విరుద్ధమని, ఈ విషయాన్ని అధికారుల దృష్టికి , కార్మికశాఖ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్మికులకు, ఉద్యోగులకు బలమైన కార్మికసంఘం ద్వారా మాత్రమే రక్షణ లభిస్తుందని వివరించారు. ఎఐటియుసి ఏరియా సమితి కార్యదర్శి మందలపర్తి హరీష్, భవన నిర్మాణ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ ,మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తాడికొండ శ్రీనివాసరావు మాట్లాడుతూ హార్టీకల్చర్ యూనివర్సిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ కు తమ సంఘాల తరపున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. యూనియన్ కార్యదర్శి సిద్దాబత్తుల కృష్ణారావు వందన సమర్పణ చేశారు.

## సూర్య మల్టీ స్పెషాలిటీ ఆధ్వర్యంలో వసంత నాగేశ్వరరావు జన్మదిన వేడుకలు.. ఐతవరంలో ఘనంగా మెగా వైద్య శిబిరం

**నందిగామ, జూలై 29 (ప్రజా వీక్షణం):**

ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం ఐతవరం గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ) భవనంలో మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు జన్మదినాన్ని పురస్కరించుకుని సూర్య మల్టీ స్పెషాలిటీ ఆధ్వర్యంలో ఒక మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా శిబిరంలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలను స్వయంగా పరిశీలించి, వైద్య సిబ్బందితో మాట్లాడారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు మరియు నిపుణుల సలహాలు అందించడం ఎంతో అభినందనీయమని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఇటువంటి వైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆమె అన్నారు. మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమం నిర్వహించడం పట్ల నిర్వాహకులను ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, వైద్య సిబ్బంది మరియు స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## ఘనంగా మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు జన్మదిన వేడుకలు

**వసంత నాగేశ్వరరావు జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు తంగిరాల సౌమ్య, వసంత కృష్ణ ప్రసాద్**

**నిండు నూరేళ్లు ప్రజాసేవలో కొనసాగాలి: వసంత నాగేశ్వరరావు జన్మదిన వేడుకల్లో ప్రముఖుల ఆకాంక్ష**

**ఐతవరం, జులై 29 (ప్రజా వీక్షణం):**

మాజీ మంత్రివర్యులు శ్రీ వసంత నాగేశ్వరరావు జన్మదిన వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, మైలవరం శాసనసభ్యులు శ్రీ వసంత వెంకట కృష్ణ ప్రసాద్‌తో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వసంత నాగేశ్వరరావుకు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయనను శాలువాతో సత్కరించి, జ్ఞాపికను (మొమెంటో) అందజేశారు. వసంత నాగేశ్వరరావు ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లుతూ, మరింతకాలం ప్రజాసేవలో కొనసాగాలని వారు ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## కస్తూరిబా గాంధీ పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్..

**దేవరకద్ర జులై 29 ప్రజా విక్షణం**

మండల పరిధిలోని డోకూరు గ్రామ శివారులో ఉన్న కస్తూర్బా గాంధీ పాఠశాలను బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూప్రకారంగా భోజన సౌకర్యాలు సక్రమంగా ఇస్తున్నారా లేదా అని అక్కడ ఉన్న వారిని ఆయన అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు అన్ని విధాల చర్యలు తీసుకోవాలని ఆయన ఉపాధ్యాయులను కోరారు. ఆయన వెంట అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఇక నిరంతరం పాఠశాలల పర్యవేక్షణ..

**జిల్లా అడిషనల్ కలెక్టర్ మధు సూధన్ నాయక్**

**దేవరకద్ర జులై 29 ప్రజా విక్షణం**

విద్యాభివృద్ధి లో పాలమూరు జిల్లా ను ప్రథమ స్థానంలో నిలిపేశీ దుకు ఇక మీదట ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణ నిరంతరం జరుగుతుందని జిల్లా అడిషనల్ కలెక్టర్ మధు సూదన్ నాయక్ వెల్లడించారు . మండల స్థాయి ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమంలో భాగంగా బుధవారం దేవరకద్ర లోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఉపాధ్యాయ శిక్షణ శిబిరాన్ని జిల్లా అడిషనల్ కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్బంగా ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడుతూ ప్రతి రోజు తాను స్వయంగా పాఠశాలలను పర్యవేక్షిస్తానని అన్నారు. విధి నిర్వహణలో ఉపాధ్యాయులు బాధ్యత యుతంగా పనిచేస్తూ విద్యా ప్రమాణాలు పెంపొందించాలని సూచించారు. విధి నిర్వహణ విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం వహిశీచిన చర్యలు తప్పవన్నారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి యే లక్ష్యంగా ప్రతి చిత్త శుద్ధితో పనిచేయాలన్నారు తదుపరి కస్తూర్బా గాంధీ స్కూల్ సందర్శించారు . ఈ కార్యక్రమంలో యం పి డి ఓ శ్రీనివాస్ రావు, యం ఈ ఓ బలరామ్, జి హెచ్ యం రమేష్, ఆర్ పి లు శ్రీనివాస్ రెడ్డి, పవన్ కుమార్, శంకర్ నాయక్, నాగరాజు, ఉపాధ్యాయులు అశ్విని చంద్రశేఖర్, రఘు వర్ధన్ రెడ్డి, శ్రీకాంత్ యాదవ్, నాగేశ్వర్ రెడ్డి, డి. అజయ్, సుదర్శన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# జీఓ 396 రద్దు చేయాలి,రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు ఏర్పాటు చేయరాదు

**బాపట్ల : జూలై 29 ( ప్రజా వీక్షణం )**

బాపట్ల జిల్లా రిజిస్ట్రారు కార్యాలయం వద్ద బాపట్ల దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం 10వ రోజున కూడా పెన్ డౌన్ కార్యక్రమాని కొనసాగిస్తున్నారు.ఈ సందర్భంగా ఉప్పాల పూర్ణచంద్రరావు మాట్లాడుతూ.....రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా దస్తావేజు లేఖరుల ఉపాధిని కోల్పోకుండా జీవో 396 రద్దు చేయాలని,రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు ( ఆర్ ఎస్ కె )ఏర్పాటు చేయరాదని మరియు పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్ షిప్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఆర్ ఓ డాక్యుమెంట్ రైటర్లు నిరవధిక పెన్ డౌన్ కార్యక్రమంలో పాల్గొన్నారు.




# డా బీ ఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ అడ్మిషన్స్ పోస్టర్ ను ఆవిష్కరణ...

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జూలై 29 (ప్రజా వీక్షణం న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ డా బీ ఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్, గవర్నమెంట్ డిగ్రీ కళాశాల కాగజ్ నగర్ లో 2026-27 సం. రాని కి గాను డా బీ ఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ అడ్మిషన్స్ పోస్టర్ ను ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎమ్ ఎస్ కె.శ్రీదేవి మాట్లాడుతూ ఇంటర్మీడియట్ లేదా తత్సమాన అర్హత కలిగిన విద్యార్థులు డా బీ ఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల కాగజ్ నగర్ లో బి ఏ, బి కం, మరియు బి ఎస్ సి డిగ్రీ కోర్సులలో అడ్మిషన్ పొందడానికి వచ్చే నెల అనగా ఆగస్టు 7 వ తేదీ లోగా డా బీ ఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధికారిక వెబ్సైట్ ఐతీ దీ=ూఖ శీఅశ్రీఱఅవ.ఱఅ లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కళాశాల స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ శ్రీ తూడూరు దత్తాత్రేయ, వైస్ ప్రిన్సిపాల్ డా లక్ష్మీ నరసింహం, కళాశాల కోఆర్డినేటర్ శ్రీ దుర్గం జనార్దన్, అధ్యాపకులు డా ఇ .శారద, ముంజం రాజేశ్వర్, డా వీరమల్ల దేవేందర్, వెంకటేశం,రోజ్ మేరీ, కృష్ణవేణి మరియు నాన్ టీచింగ్ స్టాఫ్ సి ఎచ్ సత్య నారాయణ, భాస్కర్, రజిత మున్నగు వారు పాల్గొన్నారు. ఇతర వివరాలకు సెల్ నెంబర్ 9494314314, లేదా 9160144943, లేదా 9866398678 లను సంప్రదించాలని సూచించారు.




# ఆగస్టు 5న దేవరపల్లిలో నిర్వహించే జగన్‌మోహన్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని

## వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వడ్డీ రఘురాం నాయుడు

**తాడేపల్లిగూడెం ప్రతినిది జూలై 29 (ప్రజా వీక్షణం)**

పొగాకు రైతుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఆగస్టు 5న దేవరపల్లిలో నిర్వహించనున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వడ్డీ రఘురామ్ నాయుడు పిలుపునిచ్చారు. జగన్మోహన్ రెడ్డి దేవరపల్లి పర్యటన నేపథ్యంలో స్థానిక కార్యాలయంలో ఆయన అధ్యక్షతన నియోజకవర్గ నాయకులు, మండల అధ్యక్షులు, అనుబంధ విభాగాల ప్రతినిధులతో బుధవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డీ రఘురాం నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పొగాకు రైతుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తోందని, రైతులకు న్యాయం జరిగే వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. రైతుల గోడును ప్రజల తరఫున బలంగా వినిపించి, ప్రభుత్వం స్పందించేలా ఒత్తిడి తీసుకురావడమే దేవరపల్లి పర్యటన ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఆగస్టు 5న దేవరపల్లిలో జరిగే కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, పొగాకు రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. రైతుల హక్కుల పరిరక్షణ కోసం జరిగే ఈ "పొగాకు పోరు"లో పార్టీలకతీతంగా ప్రతి పొగాకు రైతు పాల్గొని ఐక్యతను చాటి చాటాలని పిలుపునిచ్చారు. రైతు సంక్షేమం కోసం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎప్పుడూ ముందుంటారని, రైతు సమస్యల పరిష్కారానికి పార్టీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని వడ్డీ రఘురామ్ నాయుడు స్పష్టం చేశారు.దేవరపల్లి సభ ద్వారా పొగాకు రైతుల సమస్యలను రాష్ట్రవ్యాప్తంగా ప్రతిధ్వనించేలా అందరూ కృషి చేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో గొర్రెల శ్రీనివాసరావు, చిట్టూరి బాపన్న, మార్లపూడి సుబ్బారావు, అనిల్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# ఏలూరు సర్వజన ఆసుపత్రిలో నవజాత శిశువు మృతిపై తీవ్ర కలకలం!






## బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాంలి : జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి

**ఏలూరు జులై 29(ప్రజా వీక్షణం)**

ఏలూరు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ఈనెల 23వ తేదీన చోటుచేసుకున్న నవజాత శిశువు మృతి ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, రాష్ట్ర వైద్య విద్యా శాఖ డైరెక్టర్ డా. విష్ణువర్ధన్ తో కలిసి ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించారు. బాధిత కుటుంబ సభ్యులను నేరుగా కలిసి వివరాలు అడిగి తెలుసుకుని, వారిని ఓదార్చారు. తమ బిడ్డ మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణ మని బాధితులు కలెక్టర్ ఎదుట వాపోయారు. దీనిపై స్పందించిన కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ.. కేసు షీట్లు, రికార్డులు పరిశీలించి సమగ్ర విచారణ జరుపుతామని, తప్పు తేలితే బాధ్యుల పై కఠిన చర్యలు తీసుకుంటా మని స్పష్టం చేశారు.ఈ తనిఖీ సందర్భ ంగా ఆసుపత్రిలో రోగులకు అందుతు న్న వైద్య సేవలు, సౌకర్యాలను పరిశీలించారు. పోస్ట్ ఆపరేటివ్ వార్డును సందర్శించి రోగులతో మాట్లాడారు. అయితే, ఆసుపత్రిలో సీసీ కెమెరాలు పనిచేయక పోవడం, బెడ్ షీట్లు మురికిగా మరియు చిరిగి ఉండడంపై సిబ్బందిపై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓపీ, ఐపీ కౌంటర్ల వద్ద రోగులు ఎక్కువ సేపు వేచిఉండకుండా త్వరితగ తిన నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. వైద్యులు, వైద్య సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని, వివిధ వైద్య విభాగాలకు చెందిన హెచ్‌ఓడీలు ఓపీ సమయంలో రోగులకు విధిగా అందుబాటులో ఉండాలని తేల్చిచెప్పారు. పోస్ట్ ఆపరేటివ్ వార్డులో అవసరమైన వైద్య చికిత్స యంత్రాలను సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధుల ద్వారా సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటా మన్నారు. నిరుపేదలకు ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్య సేవలు అందించి, ప్రజల సంతృప్తి స్థాయిని పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని వైద్య విద్యా శాఖ డైరెక్టర్ డా. విష్ణువర్ధన్‌కు కలెక్టర్ సూచించారు.

# యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకే అమరావతి ఛాంపియన్షిప్ --2026 క్రీడా పోటీలు





## జనసేన యువ నాయకులు బొలిశెట్టి రాజేష్

**తాడేపల్లిగూడెం ప్రతినిధి జూలై 29 (ప్రజా వీక్షణం)**

నియోజకవర్గ స్థాయి అమరావతి ఛాంపియన్షిప్ --2026 క్రీడా పోటీలు బుధవారం తాడేపల్లిగూడెం పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. జనసేన యువ నాయకులు బొలిశెట్టి రాజేష్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు, గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమరావతి ఛాంపియన్షిప్‌ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. యువత విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, క్రమశిక్షణ, ఆరోగ్యం, ఆత్మవిశ్వాసానికి క్రీడలే పునాది అని పేర్కొన్నారు. జనాభా తక్కువ ఉన్న చిన్న దేశాలు సైతంఅంతర్జాతీయ క్రీడల్లో విశేష విజయాలు సాధిస్తున్నాయని, మన యువత కూడా ఆ స్థాయికి చేరుకునేలా క్రీడలను అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలను ప్రారంభించి క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. క్రీడాకారులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఉప్పలపాటి శ్రీనివాస్, ఎంపీడీవో వి. చంద్రశేఖరం, ఎంఈఓ పి.ఎం.కె. జ్యోతి, జనసేన మండల అధ్యక్షుడు అడపా ప్రసాద్, నాయకులు నిలపాల దినేష్ యాదవ్, కోఆర్డినేటర్ బి. శేఖర్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువతకు అండగా కూటమి ప్రభుత్వం...జీలుగుమిల్లి లో మెగా జాబ్ మేళా ఘనంగా ప్రారంభం:







## యువతకు నియామక పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

## అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలి: ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పిలుపు

**జీలుగుమిల్లి:జులై 29(ప్రజా వీక్షణం)**

ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో, పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు సారథ్యంలో జీలుగుమిల్లి జెడ్పీ హై స్కూల్‌లో నిర్వహించిన మెగా జాబ్ మేళాను ఎమ్మెల్యే ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ ప్రముఖ సంస్థలు నిర్వహించిన ఇంటర్వ్యూలలో అర్హత సాధించి ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు నియామక పత్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రత్యేక దృష్టి సారిస్తోందని, ఇటువంటి మెగా జాబ్ మేళాల ద్వారా నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేట్ రంగంలో మెరుగైన అవకాశాలు అందుబాటు లోకి వస్తున్నాయని పేర్కొన్నారు. యువత తమ విద్యార్హతలకు అనుగుణంగా లభించే అవకాశాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ అధికారులు, వివిధ కంపెనీల ప్రతినిధులు, కూటమి నాయకులు సుంకవల్లి సాయి, గుడ్ల రాంబాబు, బండారు అనిల్, పిన్నమనేని మధు, రూపా సత్యనారా యణ, శేఖముడి సాయి, పద్దం వెంకటకృష్ణ, మేచినేని సంజయ్, బోరగం వెంకటలక్ష్మి, తోట బాలు, కోలా ధర్మరాజు, సూరిశెట్టి మహేష్, మోహన్, తొమ్మిదేళ్ల దుర్గా ప్రసాద్, కొత్తూరీ రాజేష్, సిరిబత్తుల స్వామి, మందపాటి సూర్య, దేవుడు శ్రీను, మద్దాల రమేష్, గారపాటి శ్రీను, కక్కిరాల మురళి, కక్కిరాల ఉపేంద్ర, గద్దే సుబ్రహ్మణ్యం, ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రజావీక్షణం
దినపత్రిక

# జంగారెడ్డిగూడెంలో మిన్నంటిన దేశభక్తి .. ఉత్సాహంగా 'రన్ ఫర్ పింగళి వెంకయ్య'

**పింగళి వెంకయ్య 150వ జయంతి వేడుకల్లో ఘనంగా ముందస్తు కార్యక్రమం**

**ఆగస్టు 2న త్రివర్ణ పతాక యాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ పిలుపు**

**జంగారెడ్డిగూడెం జులై 29(ప్రజా వీక్షణం):**

జాతీయ జెండా రూపకర్త, స్వాతంత్ర్య సమరయోధుడు, తెలుగు తేజం పింగళి వెంకయ్య 150వ జయంతి వేడుకలను పురస్కరించుకుని జంగారెడ్డిగూడెంలో దేశభక్తి వెల్లివిరిసింది. పీపుల్ పవర్ ట్రస్ట్ సహకారంతో ఆగస్టు 2న నిర్వహించ తలపెట్టిన రెండు కిలోమీటర్ల భారీ త్రివర్ణ పతాక యాత్రకు ముందస్తుగా 'రన్ ఫర్ పింగళి వెంకయ్య' పేరుతో ఉత్సాహ భరితమైన రన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి జెండా ఊపి ఈ రన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జంగారెడ్డిగూడెం బస్టాండ్ నుంచి అశ్వారావుపేట రోడ్డులోని బాలుర ఉన్నత పాఠశాల వరకు సాగిన ఈ పాదయాత్రలో ఎమ్మెల్యే, కూటమి నాయకులు, పట్టణ ప్రముఖులు, అధికారులు మరియు పెద్ద ఎత్తున ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీసీబీ మాజీ చైర్మన్ కరటం రాంబాబు, మాజీ ఎమ్మెల్యే గంటా మురళి రామకృష్ణ, జెడ్పీటీసీ సభ్యులు పోల్నాటి బాబ్జి, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్, మండల అధ్యక్షుడు కుక్కల మాధవరావు తమ పార్టీ నాయకులతో కలిసి భారీ ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో ఎమ్మెల్యే రోషన్ కుమార్ మాట్లాడుతూ.. ప్రపంచంలోనే మన జాతీయ జెండాకు ప్రత్యేక గుర్తింపు ఉందని, మువ్వన్నెల జెండాగా మన గౌరవానికి ప్రత్యేకగా జాతీయ జెండాను అందరూ గౌరవిస్తారని తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమంలో మూడు రంగుల జెండా ప్రముఖమైన పాత్రను వహించిందని, నేటికీ మిగతా దేశాల వలె కాకుండా దేశ గౌరవాన్ని సూచిస్తూ జాతీయ జెండాను ఉపయోగిస్తామన్నారు. అలాంటి జాతీయ జెండాను రూపొందించిన వ్యక్తి మన తెలుగువారైన పింగళి వెంకయ్య గారు కావడం మన అదృష్టమని, ఆయన జయంతిని పురస్కరించుకుని ఇంతటి మహత్తరమైన కార్యక్రమాన్ని నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. ఆగస్టు 2న జరిగే రెండు కిలోమీటర్ల జాతీయ జెండా ప్రదర్శన కార్యక్రమానికి స్థానిక ఎంపీ పొట్ట మహేష్, మంత్రివర్యులు ఇతర పెద్దలు విచ్చేస్తున్నారని, కావున ప్రతి ఒక్కరూ దేశభక్తిని చాటే విధంగా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అలాగే మాజీ ఎమ్మెల్యే గంటా మురళి రామకృష్ణ, మాజీ డీసీసీబీ చైర్మన్ కరాటం రాంబాబు



మాట్లాడుతూ.. నగరంలో ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం ఎంతో సంతోషమని, అంత ఉదయాన్నే ఎమ్మెల్యే ఈ కార్యక్రమానికి రావటం కొత్త ఉత్సాహాన్ని నింపిందని అన్నారు. ఆగస్టు 2న జరిగే కార్యక్రమానికి ఇదే ఉత్సాహంతో అందరం కలిసి పాల్గొనాలని కోరారు. కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ దాసరి శ్యామ్ చంద్ర శేషు మాట్లాడుతూ.. జాతీయ సమైక్యతా భావంతో తెలుగువారైన పింగళి వెంకయ్య గారికి నివాళి అర్పించే విధంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. ఆగస్టు 2న జరిగే భారీ జాతీయ జెండా ప్రదర్శనకు ప్రతి ఒక్కరూ కులాలు, మతాలు, ప్రాంతాలు, వర్గాలు, వర్ణాలకు అతీతంగా హాజరై ఆ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో సేవా జోజి, ఎంఈఓ రాముడు, ఎస్సై కృష్ణ ప్రసాద్, రావూరి కృష్ణ, మద్ది చైర్మన్ రాజన్న సత్యనారాయణ, పరిమి సత్తిపండు, బొబ్బర రాజ్‌పాల్, ఈడా సూర్యచంద్ర శ్రీనివాస్, దాకారపు కృష్ణ, పాలపర్తి శ్రీనివాస్, ఆకుల రాకేష్, దాసరి శేషు, తన్నీరు రామకృష్ణ, శీలం కృష్ణంరాజు, మహంకాళి రాంబాబు, రామాంజనేయులు, సింహాద్రి మొబైల్ రాంబాబు, గోళ్లమందల శ్రీను, గంధం గోపాలకృష్ణ, తూటికుంట రాము, కొట్టూరు ప్రసాద్, గోవాడ సత్యనారాయణ, కొంచడా ప్రసాద్, ఉక్కుర్తి సీతారాం, నాగరాజు, వడిగాళ్ల శ్రీను, అన్నపురెడ్డి గంగాధర్, ఎలికే ప్రసాద్, తాతారావు, సుధీర్, నులకాని చందు, కటారి వాసు, విష్ణు, పేంట్ సాహెబ్, రమణ, జగదీష్, రొంపిలి శ్రీను, తాళ్లూరి వెంకటేశ్వరరావు, తడికల దావీదు తదితరులతో పాటు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

# బాపట్ల మహిళా ఇంజనీరింగ్ కళాశాల

**- కోర్ ఐటీటీ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఇండియా ఒంగోలు మధ్య ఎంఓయూ ఒప్పందం**

**బాపట్ల : జూలై 29 ( ప్రజా వీక్షణం )**

బాపట్ల మహిళా ఇంజినీరింగ్ కాలేజ్ మరియు కోర్ ఐటీటీ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్–ఇండియా ఒంగోలు మధ్య పరిశ్రమ––విద్యాసంస్థల అనుసంధానాన్ని బలోపేతం చేయడం,విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలు,ప్రాక్టికల్ నాలెడ్జ్,ఉపాధి అవకాశాలు మరియు నూతన ఆవిష్కరణలను పెంపొందించడం లక్ష్యంగా అవగాహన ఒప్పందం (ఎంఓయూ ) కుదిరింది. ఈ ఒప్పందంలో భాగంగా విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు, ఇండస్ట్రియల్ విజిట్స్, వర్క్‌షాప్‌లు,సెమినార్లు,గెస్ట్ లెక్చర్లు,ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లను నిర్వహించనున్నారు. అలాగే పరిశ్రమ సమస్యల ఆధారంగా లైవ్ ప్రాజెక్టులు,తుది సంవత్సరం ప్రాజెక్టులకు సాంకేతిక మార్గదర్శకత్వం, పరిశోధన––ఆవిష్కరణలకు సహకారం అందించనున్నారు. ఈ సంస్థ నిపుణుల ద్వారా సాంకేతిక శిక్షణ,నిపుణుల ఉపన్యాసాలు,విద్యార్థుల పరిశోధన మరియు ఆవిష్కరణలకు మెంటరింగ్, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా పాఠ్యాంశాల అభివృద్ధికి సలహాలు మరియు సూచనలను అందించనుంది. ప్రతిభావంతులైన విద్యార్థులకు సంస్థ నియామక విధానాలకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలను కూడా ఇచ్చే అవకాశం ఉంటుంది. ఈ సందర్భంగా బాపట్ల ఉమెన్స్ ఇంజినీరింగ్ కాలేజ్ ప్రిన్సిపల్ డా.హిమబిందు మాట్లాడుతూ...ఈ ఒప్పందం ద్వారా ఇండస్ట్రీ మరియు ఇన్స్టిట్యూషన్ గ్యాప్ ను తగ్గించవచ్చన్నారు.బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ యాజమాన్యం మాట్లాడుతూ, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఈ భాగస్వామ్యం కీలకంగా నిలుస్తుందని,విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి,పరిశోధన, ఆవిష్కరణలు మరియు ఉపాధి అవకాశాలను మరింత మెరుగుపరచడానికి ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు.



# రావు శ్రీకృష్ణదేవరాయలుకు అభినందనలు తెలిపిన బైరా దిలీప్ చక్రవర్తి

**చిలకలూరిపేట : జూలై 29 ( ప్రజా వీక్షణం )**

ప్రముఖ పారిశ్రామిక వేత్త బైరా దిలీప్ చక్రవర్తి చిలకలూరిపేటకు చెందిన రావు శ్రీకృష్ణదేవరాయలు రాష్ట్ర స్థాయి కుంగ్ ఫు పోటీల్లో బంగారు పతకం సాధించిన సందర్భంగా అభినందనలు తెలిపారు. చిలకలూరిపేటలో రావు సుబ్రహ్మణ్యం స్వగృహంలో బుధవారం కలసి శుభాకాంక్షలు తెలిపారు. డౌన్ సింట్రోమ్ ఉన్నప్పటికీ శారీరక శ్రమ చేసి క్రమశిక్షణగా మార్షల్ ఆర్ట్స్ నేర్చుకున్న శ్రీకృష్ణదేవరాయలు కృషి అభినందనీయం అన్నారు.



# గ్రామ గ్రామాన అభివృద్ధి జోరు.. కూటమి ప్రభుత్వమే ప్రజా సంక్షేమానికి చిరునామా!

**- ఐతవరంలో రూ.44 లక్షలతో నూతన సీసీ రోడ్డు ప్రారంభం**

**- మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావుతో కలిసి ప్రారంభించిన నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య**

**ఐతవరం, జూలై 29 (ప్రజా వీక్షణం):**

నందిగామ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఉద్ఘాటించారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం ఐతవరం గ్రామంలో ఎంపీ లాడ్స్ నిధుల నుంచి రూ.44 లక్షలతో నిర్మించిన నూతన సీసీ రోడ్డును బుధవారం ఆమె మాజీ మంత్రివర్యులు శ్రీ వసంత నాగేశ్వరరావు, కూటమి నేతలు మరియు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తోందన్నారు. గత పాలనలో ఏర్పడిన అప్పుల భారంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ, ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ఎక్కడా విస్మరించకుండా ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని తెలిపారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల



కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం తదితర రంగాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు. ఐతవరం గ్రామంలో నూతన సీసీ రోడ్డు నిర్మాణంతో స్థానిక ప్రజలు, రైతుల రాకపోకలకు మరింత సౌకర్యం కలగనుందని, గ్రామాభివృద్ధికి ఇది మరొక ముందడుగు అని తంగిరాల సౌమ్య తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి వారి సమస్యలను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆగస్టు 1న భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవ సభను విజయవంతం చేయాలి

**బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు పిలుపు**

**బాపట్ల : జూలై 29 ( ప్రజా వీక్షణం )**

ఆగస్టు 1న భారత ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభం కానున్న "భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం" ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు పాలకొండ నియోజకవర్గ పరిశీలకులుగా స్థానిక టిడిపి ఇన్‌చార్జ్ పడాల భూదేవితో కలిసి తెలుగుదేశం పార్టీ మండల పార్టీ అధ్యక్షులు,క్లస్టర్ ఇన్‌చార్జులు మరియు బూత్ ఇన్‌చార్జులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించి విమానాశ్రయ ప్రారంభోత్సవ సభ ఏర్పాట్లపై కూలంకషంగా చర్చించారు. ఈ సందర్భంగా బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు మాట్లాడుతూ....."ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధికి,రాష్ట్ర ఆర్థిక రంగానికి భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ఒక కీలక మైలురాయిగా నిలవబోతోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి,కృషి ఫలితంగానే ఈ బృహత్తర ప్రాజెక్టు కల నెరవేరుతోంది. ఆగస్టు 1న గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించనున్న ఈ చారిత్రాత్మక రికార్డు సభకు పాలకొండ నియోజకవర్గం నుండి పార్టీ శ్రేణులు,నాయకులు,ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలి. బూత్ స్థాయి నుండి పార్టీ నాయకులు,కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని పిలుపునిస్తున్నానన్నారు. ఈ సమావేశంలో పాలకొండ నియోజకవర్గ టిడిపి ముఖ్య నాయకులు,వివిధ మండలాల అధ్యక్షులు,క్లస్టర్,బూత్ ఇన్‌చార్జులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.



# బంగారం పేటలో 'డోర్ టూ డోర్ '.. సంక్షేమంపై ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు ముమ్మర ప్రచారం!

**ప్రతి ఇంటికీ వెళ్లి లబ్ధిదారులతో ప్రత్యక్ష ముఖాముఖి**

**అర్హులందరికీ ప్రభుత్వ ఫలాలు అందుతున్నాయా అని ఆరా**

**పోలవరం జులై 29(ప్రజా వీక్షణం)**

ఏలూరు జిల్లా పోలవరం నియోజకవర్గం పోలవరం మండలం బంగారం పేట గ్రామంలో 'డోర్ టూ డోర్' ప్రచార కార్యక్రమం బుధవారం అత్యంత ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రైకార్ చైర్మన్, పోలవరం నియోజకవర్గ తెదేపా ఇన్‌చార్జ్ బొరగం శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరై, ప్రచారాన్ని ముమ్మరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను నేరుగా కలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లు, ఉచిత బస్సు ప్రయాణం మరియు ఇతర సంక్షేమ పథకాల లబ్ధి వివరాలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ సక్రమంగా అందుతున్నాయా లేదా అని వివరంగా ఆరా తీశారు. ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మంగిన వెంకటరమణ, సొసైటీ అధ్యక్షులు నులకని రాంబాబు, మండల ఐటీడీపీ అధ్యక్షులు కోడి శ్రీను, మాదేపల్లి హరిబాబు, మాదేపల్లి



ప్రసాద్, యూనిట్ ఇంచార్జ్ నునకాని ధర్మేంద్ర, బూత్ ఇంచార్జులు చిలపర్తి పోసి రావు, కోడి రాజు, నాయకులు కర్రీ సుబ్రహ్మణ్యం, కర్రీ వెంకటేశ్వరరావు, ఎస్ వి ఎస్ ప్రసాద్, సొసైటీ డైరెక్టర్ తెలగం శెట్టి నాగేశ్వరరావు, గ్రామ కమిటీ అధ్యక్షులు పూడి సత్యనారాయణ, నల్ల రాంబాబు, నారాయణరావు, బన్ను, నౌడు నాగేశ్వరావు తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

## భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి కీలక మైలురాయిగా నిలుస్తోంది

### తెదేపా తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇంచార్జ్ వలవల మల్లిఖార్జురావు (బాబ్జి)

తాడేపల్లిగూడెం ప్రతినిధి జూలై 29 (ప్రజా వీక్షణం)

కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి కీలక మైలురాయిగా నిలుస్తుందని తెదేపా గజపతినగరం నియోజకవర్గ పరిశీలకులు, భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల మల్లిఖార్జునరావు (బాబ్జి) తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఆగస్టు 1న భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో మోదీ పర్యటన ఏర్పాట్లపై వలవల మల్లిఖార్జునరావు (బాబ్జి) అధ్యక్షతన విస్తృత స్థాయి సమీక్ష సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. గజపతినగరం, బొండపల్లి, జామి మండలాల్లోని అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వలవల మల్లిఖార్జునరావు (బాబ్జి) మాట్లాడుతూ ప్రధానమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రవాణా, భద్రత, పార్కింగ్, తాగునీరు తదితర అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. దేశ ప్రతిష్ఠను మరింత పెంచే ఈ చారిత్రాత్మక కార్యక్రమాన్ని అత్యంత విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూబాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## జనసేన పార్టీ ఆధ్వర్యంలో దివ్యాంగుల ఆత్మీయ సమావేశం విజయవంతం

బాపట్ల :29 జూలై ( ప్రజా వీక్షణం )

జనసేన పార్టీ ఆధ్వర్యంలో మంగళగిరిలోని చల్లపల్లి కళ్యాణ మండపంలో దివ్యాంగుల ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహించారు.ఈ సమావేశంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి జనసేన పార్టీలో సభ్యత్వం కలిగిన దివ్యాంగ జనసైనికులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ అభిప్రాయాలు, సూచనలు,సమస్యలను పంచుకున్నారు.ఈ సమావేశానికి చల్లపల్లి శ్రీనివాసరావు,కిలారీ వెంకట రోశయ్య,గంజి చిరంజీవి ముఖ్య అతిథులుగా హాజరై దివ్యాంగుల సంక్షేమం, రాజకీయ భాగస్వామ్యం మరియు జనసేన పార్టీలో వారి పాత్రపై ప్రసంగించారు. దివ్యాంగులకు పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని,వారి సేవలకు తగిన గుర్తింపు కల్పించే దిశగా కృషి చేస్తామని వారు తెలిపారు.సమావేశంలో ముఖ్యంగా ఈ క్రింది అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు:- జనసేన పార్టీలో దివ్యాంగుల కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.- రాష్ట్రవ్యాప్తంగా దివ్యాంగ జనసైనికులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి బలోపేతం చేయాలని అభిప్రాయపడ్డారు.- అతి త్వరలో జనసేన పార్టీ దివ్యాంగుల రాష్ట్ర అధ్యక్షుడిని నియమించాలని కోరారు.- ప్రతి జిల్లాలో దివ్యాంగుల కమిటీలను ఏర్పాటు చేసి, పార్టీ కార్యక్రమాల్లో వారికి మరింత ప్రాధాన్యం కల్పించాలని సూచించారు.ఈ సమావేశం ద్వారా దివ్యాంగ జనసైనికులు ఐక్యంగా పనిచేసి పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేయాలని సంకల్పించారు.సమావేశంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలియజేశారు."దివ్యాంగుల సాధికారతే జనసేన లక్ష్యం -- ప్రతి దివ్యాంగుడికి పార్టీలో సముచిత స్థానం కల్పించడమే మా సంకల్పం" అని సమావేశంలో నాయకులు పేర్కొన్నారు.ఈ సమావేశంలో దివ్యాంగుల జనసైనికులు గోగన అదిశేషు,కోకి రాజశేఖర్ రెడ్డి,శెట్టివారి రఘు,నల్లపనేని కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



## వేతనాలు మంజూరు చేయాలని అడిషనల్ కలెక్టర్ కు వినతి పత్రం అందజేసిన ఫీల్డ్ అసిస్టెంట్లు.

దేవరకద్ర జులై 29 ప్రజా విక్షణం

దేవరకద్ర మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రభుత్వం పెండింగ్లో ఉన్న వేతనాలు వెంటనే మంజూరు చేయాలని కోరుతూ బుధవారము జిల్లా అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్ కు ఎంపీడీవో కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు ఒక వినతిపత్రం సమర్పించారు. వేతనాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని అందుకు ప్రభుత్వం వెంటనే పెండింగ్లో ఉన్న వేతనాలు మంజూరు చేయాలని వారు కోరారు. అని వెంట ఎంపీడీవోశ్రీనివాసరావు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



## ములగలంపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో ఘనంగా 'అంతర్జాతీయ పులుల దినోత్సవం'

ములగలంపల్లి:జులై 29(ప్రజా వీక్షణం)

ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం ములగలంపల్లిలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జులై 29 (బుధవారం) నాడు అంతర్జాతీయ పులుల దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కె. రాంబాబు మాట్లాడుతూ... అడవుల సంరక్షణ, పర్యావరణ సమతుల్యత మరియు పులుల ఉనికి ప్రాముఖ్యతపై విద్యార్థులకు, గ్రామస్థులకు వివరించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. ప్రసాద్ నేతృత్వంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, అటవీశాఖ అధికారులు మరియు సిబ్బంది అందరిచేత 'అటవీ ప్రతిజ్ఞ' చేయించారు. అలాగే ప్రకృతిని, వన్యప్రాణులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఈ సందర్భంగా హెచ్ఎం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్, ఉపాధ్యాయిని-ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.




## సంత్ రావిదాస్ జీవితం ఆదర్శనీయం

### బిజెపి రాష్ట్ర కార్యదర్శి భోగిరెడ్డి ఆదిలక్ష్మి

తాడేపల్లిగూడెం ప్రతినిధి జూలై 29 (ప్రజా వీక్షణం)

సామాజిక అసమానతలను రూపుమాపేందుకు సంత్ శిరోమణి రవిదాస్ మహారాజ్ చేసిన కృషి ఆదర్శనీయమని బిజెపి రాష్ట్ర కార్యదర్శి భోగి రెడ్డి ఆదిలక్ష్మి తెలిపారు. సంత్ శిరోమణి రవి దాస్ మహారాజ్ 650 జయంతి సందర్భంగా భారతీయ జనతా పార్టీ తాడేపల్లిగూడెం శాఖ ఆధ్వర్యంలో స్థానిక శ్రీనివాస రామాలయం వద్ద బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి బిజెపి పట్టణ అధ్యక్షులు దువ్వా శ్రీను అధ్యక్షత వహించారు. బిజెపి రాష్ట్ర కార్యదర్శి భోగి రెడ్డి ఆదిలక్ష్మి మాట్లాడుతూ వారణాసిలో అతి పేద కుటుంబంలో జన్మించిన సంత్ రవి దాస్ సమాజంలో అసమానతలను రూపుమాపేందుకు విశేష కృషి చేశారని కొనియాడారు. చర్మకార వృత్తిలో ఎంతో కష్టించి జీవనం సాగించిన రవిదాస్ ఆధ్యాత్మికవేత్తగా, కవిగా, గాయకునిగా ప్రఖ్యాతి గడించారని ప్రశంసించారు. రవిదాస్ గీతాలను సిక్కుల పవిత్ర గ్రంథంలో పొందుపరిచారని, ఆయన జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని, ఆయన జయంతి కార్యక్రమాలు 2027 ఫిబ్రవరి వరకు భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందని వివరించారు. భారతీయ జనతా యువమోర్చా జిల్లా అధ్యక్షులు పత్స గోపాలకృష్ణ మాట్లాడుతూ గురు పౌర్ణమి సందర్భంగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో శాంతి రవిదాస్ వంటి మహనీయుల గురించి దేశ వ్యాప్తంగా ప్రజలకు తెలియచెప్పేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. బిజెపి పట్టణ అధ్యక్షులు దువ్వా శ్రీను మాట్లాడుతూ 13 -14 వ శతాబ్దాలకు చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక సామాజిక సాధుసంతులలో ఒకరైన సంత్ రవి దాస్ జీవితం సమాజానికి ఆదర్శనీయమని తెలిపారు. మనుషులంతా ఒకటేనని, మానవత్వం ముఖ్యమని చాటి చెప్పారని వివరించారు. ముందుగా సంత్ రవిదాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి చిట్యాల రాంబాబు, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు టి సూర్య కుమారి, బిజెపి రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యులు కడప రమేష్ కుమార్, యువమోర్చా జిల్లా ఉపాధ్యక్షులు మానేపల్లి భార్గవ,బిజెపి నేతలు బసవన్న, ఉప్పులూరి మధు, తదితరులు పాల్గొన్నారు.



## రెల్లి కాలనీలో వ్యాస పౌర్ణమి

బాపట్ల : జూలై 29 ( ప్రజా వీక్షణం )

బుధవారం బాపట్ల పట్టణంలో ని 3వ వార్డు రెల్లి కాలనీలో ఉన్న పోలేరమ్మ గుడి దగ్గర సమాజ సేవకురాలు బంద్రెడ్డి రజని వ్యాస పౌర్ణమి సందర్భంగా రెల్లి కాలనీలో ఉన్న మహిళలతో కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.మొదటగా వ్యాస మహర్షి గురించి వివరించి సనాతనంగా వచ్చిన వేదాలు,పురాణాలు గురించి వివరించి శు భాకాంక్షలు తెలియచేశారు.అనంతరం మహిళలకు మందార పూల మొక్కలను అందచేశారు. అలాగే ఒక వయసులో పెద్దవారైనా మాతృ మూర్తికి చీర అందచేసి అందరికి స్వీట్స్ పంచటం జరిగింది.ఇలాంటి కార్యక్రమం లో మనమందరం పాలుపంచుకోవటం చాలా అదృష్టం అని సంతోషం గా ఉంది అని తెలియచేసారు.




## మానసిక ఉల్లాసానికి చీరాల,బాపట్ల విలేకరుల ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్

బాపట్ల : జూలై 29 ( ప్రజా వీక్షణం )

మానసిక ఉల్లాసం,పరస్పర స్నేహభావం,మీడియా మిత్రుల మధ్య ఐక్యతను పెంపొందించాలనే ఉద్దేశంతో బుధవారం వాడరేవు రోడ్డులోని హాయ్ రెస్టారెంట్ వెనుక ఉన్న విశాలమైన మైదానంలో చీరాల, బాపట్ల ప్రాంతాలకు చెందిన విలేకరులు ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు.ఈ మ్యాచ్‌లో చీరాల,బాపట్ల మీడియా మిత్రులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని సరదాగా ఆటను ఆస్వాదించారు. గెలుపోటములకు అతీతంగా పూర్తిగా స్నేహపూర్వక వాతావరణంలో మ్యాచ్ సాగింది.వృత్తిపరమైన ఒత్తిడికి కొంత విరామం ఇచ్చి అందరూ కలిసి ఉల్లాసంగా గడిపారు.ఈ సందర్భంగా ఇరు ప్రాంతాల విలేకరులు ఒకరినొకరు ఆప్యాయంగా పరిచయం చేసుకుంటూ పరస్పర అనుబంధాన్ని మరింత బలోపేతం చేసుకున్నారు. ఇలాంటి కార్యక్రమాలు మానసిక ఉల్లాసాన్ని కలిగించడంతో పాటు మీడియా మిత్రుల మధ్య ఐక్యత,స్నేహభావాన్ని మరింత పెంపొందిస్తాయని పాల్గొన్న విలేకరులు పేర్కొన్నారు. మనమందరం బాపట్ల జిల్లాకు చెందిన మీడియా మిత్రులమే కావడంతో పరస్పర పరిచయాలు మరింత పెరిగితే ఐకమత్యం బలోపేతం అవుతుందని, భవిష్యత్తులో కూడా ఇలాంటి స్నేహపూర్వక క్రీడా కార్యక్రమాలను తరచూ నిర్వహించుకోవాలని పలువురు జర్నలిస్టులు అభిప్రాయపడ్డారు.ఈ ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్‌లో డి. దిలీప్ (ఆర్‌కే న్యూస్),ఎం. కోటేశ్వరరావు (పల్నాటి వార్త), కె. రాజేష్ (బిగ్ టీవీ),ఆనంద్ కుమార్,ఆర్.వి.బి. చిన్నబాబు (పల్నాటి సాక్షి),షేక్.సుభాని (టైమ్స్ న్యూస్),జే.రత్నం (స్వతంత్ర టీవీ),సుధాకర్ (సుధాకర్ టీవీ),కె. వాసు (ఏఎన్ఎన్),న్యూస్ భాష (హెచ్ఎంటీవీ),చిన్న (క్రైమ్ కౌంటర్),దుర్గాప్రసాద్ (సిక్స్ టీవీ),మస్తాన్ వలి (కాకతీయ న్యూస్)తో పాటు పలువురు మీడియా మిత్రులు పాల్గొన్నారు.ఈ స్నేహపూర్వక క్రికెట్ మ్యాచ్‌కు ఆంధ్రజ్యోతి న్యూస్ రిపోర్టర్ ప్రదీప్ సమన్వయం వహించి అందరికీ ప్రోత్సాహం అందించారు.ఇంకా పలువురు మీడియా మిత్రులు హాజరు కావాల్సి ఉన్నప్పటికీ,వ్యక్తిగత మరియు వృత్తిపరమైన కారణాల వల్ల పాల్గొనలేకపోయారు.వారు ప్రత్యక్షంగా హాజరు కాకపోయినా తమ పూర్తి మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని తెలియజేయగా, వారికి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం అనంతరం అందరూ కలిసి ఆత్మీయంగా గడిపి,ఇలాంటి స్నేహపూర్వక కార్యక్రమాలు మీడియా మిత్రుల మధ్య అనుబంధాన్ని మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు.



## నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో " ఇన్వెస్టర్ సెర్మనీ "

బాపట్ల : జూలై 29 ( ప్రజా వీక్షణం )

బాపట్ల జిల్లా,బాపట్ల పట్టణం నందు ఉన్న నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు "ఇన్వెస్టర్ సెర్మనీ" పాఠశాల ప్రిన్సిపల్ బెల్లంకొండ భాగ్యరాణి సభాధ్యక్షతన ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి గా బాపట్ల డి.ఎస్.పి.సి.హెచ్ చంద్ర మౌళి పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఎలక్షన్స్ లో గెలిచిన హెడ్ బాయ్ / గర్ల్, డిప్యూటీ హెడ్ బాయ్ / గర్ల్, జూనియర్స్ మరియు ఎన్నుకోబడిన ఎకో, స్పోర్ట్స్ మొ. క్లబ్ మెంబెర్స్ ను బ్యాడ్జెస్ తో అభినందించారు. ఈ సందర్భంగా డి.ఎస్.పి మాట్లాడుతూ.....పాఠశాల వయసు నుంచే పిల్లల్లో సమాజం,రాజ్యాంగం పైన అవగాహన కలిగి ఉండాలని, నాయకత్వ లక్షణాలు, విలువలను తెలియజేశారు.ఈ కార్యక్రమంలో క్లస్టర్ ప్రిన్సిపల్ ఆర్.కె.శర్మ, హైస్కూల్ కోఆర్డినేటర్ తిరుమల రావు,ఇచాంప్స్ కోఆర్డినేటర్ శిరీష పాల్గొన్నారు.






## దేవస్థానం ఈవోగా మధుసూదన్ రెడ్డికి ప్రమోషన్..

దేవరకద్ర జులై 29 ప్రజా వీక్షణం

దేవరకద్ర మండల పరిధిలోని చిన్న రాజమూరు గ్రామంలో ఆంజనేయ స్వామి దేవస్థానం వద్ద జూనియర్ అసిస్టెంట్ గా పని చేసిన మధుసూదన్ రెడ్డికి దేవస్థానం ఈవోగా ప్రమోషన్ రావడం జరిగింది. ఇందుకుగాను బుధవారము రాష్ట్ర తెలంగాణ దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, అదనపు కమిషనర్ జ్యోతి, శ్రీనివాసరావు, ప్రాంతీయ సంయుక్త కమిషనర్ రామకృష్ణ, సమక్షంలో గ్రేడ్ 3 ప్రమోషన్ పత్రాన్ని అందుకోవడం జరిగింది. మధుసూదన్ రెడ్డికి దేవస్థానం ఈవోగా ప్రమోషన్ రావడం చాలా సంతోషంగా ఉన్నది అని పలువురు అన్నారు.



## ఆధ్యాత్మికతతో పాటు సేవా స్ఫూర్తి: నందిగామలో ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

**భక్తులతో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య**

నందిగామ, జూలై 29 (ప్రజా వీక్షణం):

నందిగామ పట్టణంలోని శ్రీ రామలింగేశ్వర నగర్‌లో వెలసిన సాయి అయ్యప్ప దేవాలయంలో గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ వేడుకల్లో నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య భక్తులు మరియు కూటమి నాయకులతో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాబా వారి సన్నిధిలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని స్వామివారిని ఆకాంక్షించారు. అనంతరం వేద పండితులు ఆమెకు వేద మంత్రోచ్ఛారణలతో విశేష ఆశీర్వచనాలు అందజేశారు.పూజా కార్యక్రమాల అనంతరం గురుపౌర్ణమిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే స్వయంగా పాల్గొని భక్తులకు స్వయంగా అన్నప్రసాదం వడ్డించారు. ఆధ్యాత్మికతతో పాటు ప్రజాసేవే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందనే సందేశాన్ని ఈ కార్యక్రమం చాటిచెప్పింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ.. ప్రజల విశ్వాసం, ఆశీస్సులతో నందిగామ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి నిరంతరం శ్రమిస్తానని స్పష్టం చేశారు. ఆధ్యాత్మిక మరియు సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎప్పుడూ ప్రజలతో మమేకమై ముందుకు సాగుతున్న ఎమ్మెల్యేను భక్తులు, కూటమి నాయకులు అభినందించారు.



## కొండుబోట్లవారిపాలెం 121వ బూత్ లో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం

బాపట్ల : జూలై 29 ( ప్రజా వీక్షణం )

బుధవారం బాపట్ల నియోజకవర్గం బాపట్ల మండలం కేబి పాలెం గ్రామంలో 121వ బూతు లో బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు నరేంద్ర వర్మ ఆదేశానుసారం ఇంటింటికి తెలుగుదేశం రెండేళ్లలో సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాల గురించి ఇంటింటికి వెళ్లి కుటుంబ సభ్యులను కలసి రెండేళ్ల అభివృద్ధి - సంక్షేమం ఈ రెండు సంవత్సరాల్లో రాష్ట్రంలో చంద్రబాబు ఏ విధంగా అభివృద్ధి పనులు చేశారు, బాపట్ల నియోజకవర్గంలో నరేంద్ర వర్మ ఏ విధంగా అభివృద్ధి పనులు చేశారు అనే విషయాన్ని వివరిస్తూ,రాజధాని అమరావతిని నిర్మిస్తుందని,తెలుగుదేశం పార్టీ యువతకు భవిష్యత్తును ఇస్తుందని,రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి ఇలా అనేక విషయాలు చర్చిస్తూ వారి ఫోటోస్ ను మై టిడిపి యాప్ లో అప్లోడ్ చేశారు.ఈ కార్యక్రమంలో బాపట్ల పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజినీ జీవన్,బూత్ ఇన్చార్జ్ మార్పు ప్రతాప్, గ్రామ పార్టీ అధ్యక్షులు ఎం. కొండలు తెలుగు యువత మండల అధ్యక్షుడు మార్పు ఆనందరావు,పసుమర్తి ఆనంద్,కె ఎస్ ఎస్ లు తదితరులు పాల్గొన్నారు.



## భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తతగా ఉందన్న జిల్లా కలెక్టర్ హరిత...

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జూలై 30 (ప్రజా వీక్షణం న్యూస్)

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో నిన్న రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ప్రజలను అప్రమత్తం చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వట్టివాగు ప్రాజెక్టుకు వరద ఉధృతి కారణంగా వట్టివాగు ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది.ప్రస్తుతం వట్టివాగులోకి 4,000 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండగా, 2,000 క్యూసెక్కుల నీటిని దిగువకు (అవుట్ ఫ్లో) విడుదల చేయాలని నిర్ణయించామని వట్టివాగు పరివాహక లోతట్టు ప్రాంతాల ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ వాగులు, వంతెనలు దాటే ప్రయత్నం చేయవద్దని హెచ్చరించారు. అత్యవసరం అయితే తప్ప ఎవరూ బయటకు రావద్దని స్పష్టం చేశారు, అత్యవసర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు ప్రత్యేక బృందాలను సిద్ధంగా ఉన్నాయని ప్రజలకు సహాయం అందించేందుకు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించారు.




# గ్రామీణ ఆరోగ్యానికి కొత్త సవాలు... క్యాన్సర్

(హెచ్.ప్రతాప్)

భారతదేశంలో అంటువ్యాధుల కంటే అంటురాని వ్యాధులు వేగంగా విస్తరిస్తున్నాయి. వాటిలో క్యాన్సర్ అత్యంత ఆందోళనకరమైన ఆరోగ్య సవాలుగా మారుతోంది. ఒకప్పుడు పట్టణ జీవనశైలి వ్యాధిగా భావించిన క్యాన్సర్ నేడు గ్రామీణ భారతంలోనూ వేగంగా విస్తరిస్తోంది. పొగాకు వినియోగం, ఆహారపు అలవాట్లలో మార్పులు, పర్యావరణ కాలుష్యం, జనాభాలో వృద్ధుల సంఖ్య పెరగడం, అవగాహన లోపం, వ్యాధిని ఆలస్యంగా గుర్తించడం వంటి కారణాలు క్యాన్సర్ భారాన్ని పెంచుతున్నాయి. చికిత్సలో భారత్ గణనీయమైన పురోగతి సాధించినప్పటికీ, ముందస్తు నిర్ధారణలో గ్రామీణ ప్రాంతాలు ఇంకా వెనుకబడడం ఆందోళన కలిగిస్తోంది.భారత వైద్య పరిశోధన మండలి , జాతీయ క్యాన్సర్ రిజిస్ట్రీ కార్యక్రమం అంచనాల ప్రకారం దేశంలో ప్రస్తుతం సుమారు 25 లక్షల మంది క్యాన్సర్‌తో జీవిస్తున్నారు. ప్రతి ఏడాది 7 లక్షలకు పైగా కొత్త కేసులు నమోదవుతుండగా, సుమారు 5.56 లక్షల మంది క్యాన్సర్ కారణంగా ప్రాణాలు కోల్పోతున్నారు. మరింత ఆందోళనకరమైన విషయం ఏమిటంటే, క్యాన్సర్ మరణాల్లో 71 శాతం, అంటే దాదాపు 3.95 లక్షల మరణాలు, 30 నుంచి 69 సంవత్సరాల మధ్య వయస్సు గల వారిలోనే సంభవిస్తున్నాయి. దేశ ఉత్పాదక శక్తిని కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుండటం ప్రజారోగ్యంతో పాటు ఆర్థిక వ్యవస్థకూ సవాలుగా మారుతోంది.మహిళల ఆరోగ్య పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. భారతదేశంలో ప్రతి ఎనిమిది నిమిషాలకు ఒక మహిళ గర్భాశయ ముఖద్వార (సర్వికల్) క్యాన్సర్‌తో మరణిస్తుండగా, రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ అయ్యే ప్రతి ఇద్దరు మహిళల్లో ఒకరు ప్రాణాలు కోల్పోతున్నారు. పురుషుల్లో నోటి క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్, మహిళల్లో రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లు కలిపి దేశంలోని క్యాన్సర్ మరణాల్లో సగానికి పైగా వాటా కలిగి ఉన్నాయి. ఇదే సమయంలో ప్రతిరోజూ దాదాపు 2,500 మంది పొగాకు సంబంధిత వ్యాధులతో మరణిస్తుండటం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. పొగాకు నియంత్రణ బలోపేతం చేయకుండా క్యాన్సర్ నియంత్రణ లక్ష్యాలను సాధించడం సాధ్యం కాదు.గ్రామీణ భారతంలో పరిస్థితి మరింత క్లిష్టంగా ఉంది. దేశ జనాభాలో అధికశాతం మంది గ్రామాల్లో నివసిస్తున్నప్పటికీ, క్యాన్సర్ నిర్ధారణ కేంద్రాలు, ఆంకాలజీ నిపుణులు, ఆధునిక చికిత్సా సదుపాయాలు ప్రధానంగా నగరాల్లోనే కేంద్రీకృతమై ఉన్నాయి. ఫలితంగా గ్రామీణ ప్రజలు ప్రారంభ దశలో పరీక్షలు చేయించుకోలేక, లక్షణాలు తీవ్రమైన తర్వాతే వైద్యులను ఆశ్రయిస్తున్నారు. అప్పటికే వ్యాధి ముదిరిపోవడంతో చికిత్స ఖర్చు పెరగడమే కాకుండా ప్రాణాపాయం కూడా అధికమవుతోంది. ఆర్థిక ఇబ్బందులు, ప్రయాణ వ్యయం, రోజువారీ ఉపాధి కోల్పోయే భయం కూడా చికిత్స ఆలస్యానికి ప్రధాన కారణాలుగా మారుతున్నాయి.వైద్య నిపుణుల అంచనా ప్రకారం దేశంలో అత్యధికంగా కనిపించే మొదటి ఐదు రకాల క్యాన్సర్లలో దాదాపు 47 శాతం వరకు ముందస్తు స్క్రీనింగ్, నివారణ చర్యలు, ప్రారంభ దశలో చికిత్స ద్వారా నియంత్రించవచ్చు. నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వంటి వ్యాధులను ప్రారంభ దశలో గుర్తిస్తే పూర్తిగా నయం చేసే అవకాశాలు గణనీయంగా పెరుగుతాయి. అందువల్ల గ్రామీణ ఆరోగ్య వ్యవస్థలో క్యాన్సర్ స్క్రీనింగ్‌ను తప్పనిసరి సేవగా మార్చాల్సిన అవసరం ఉంది.ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలి. మొబైల్ స్క్రీనింగ్ యూనిట్లు, టెలిమెడిసిన్, జిల్లా స్థాయిలో సమగ్ర క్యాన్సర్ కేంద్రాల ఏర్పాటు, ఆశా కార్యకర్తలు మరియు ఏఎన్ఎంలకు ప్రత్యేక శిక్షణ, పాఠశాలలు-గ్రామ సభల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. ఆయుష్మాన్ భారత్ వంటి ప్రభుత్వ పథకాల పరిధిలో ఉచిత పరీక్షలు, కీమోథెరపీ, రేడియోథెరపీ, శస్త్రచికిత్స సేవలను మరింత విస్తరించాలి. అదే సమయంలో హెచ్‌పీవీ వ్యాక్సినేషన్, పొగాకు నియంత్రణ, ఆరోగ్యకర జీవనశైలిపై ప్రచారాన్ని జాతీయ ఉద్యమంగా చేపట్టాలి.క్యాన్సర్‌పై విజయం కేవలం ఆధునిక చికిత్సలతో సాధ్యం కాదు. ముందస్తు గుర్తింపు, గ్రామీణ ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న స్క్రీనింగ్ సదుపాయాలు, ఉచిత నాణ్యమైన వైద్యం, ప్రజల్లో అవగాహన---ఈ నాలుగు అంశాలే క్యాన్సర్ మరణాలను గణనీయంగా తగ్గించగలవు. గ్రామీణ భారతానికి క్యాన్సర్ నిర్ధారణ, చికిత్స అందుబాటులోకి రావడం ఒక ఆరోగ్య కార్యక్రమం మాత్రమే కాదు; ప్రతి పౌరుడికి సమాన ఆరోగ్య హక్కును కల్పించే జాతీయ బాధ్యత.

# భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: జిల్లా ఎస్పీ నితికా పంత్, ఐపీఎస్





**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో వరద ఉధృతి సమయంలో వాగులు, వంతెనలు దాటొద్దు -- తుంపెల్లి, గుండి వాగుల వద్ద ఎస్పీ అప్రమత్తత సూచనలు.**

**వరద ముంపు ప్రాంతాల్లో పోలీసులు అప్రమత్తం.. ప్రజలు సహకరించాలిలి**

**వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా ప్రజలకు పోలీసు శాఖ కీలక సూచనలు**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జూలై 30 (ప్రజా వీక్షణం న్యూస్ )

జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు, వాతావరణ శాఖ జారీ చేసిన హెచ్చరికల దృష్ట్యా జిల్లా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ శ్రీమతి నితికా పంత్, ఐపీఎస్ సూచించారు.ఆసిఫాబాద్ లోని తుంపెల్లి వాగు, గుండి వాగు లను పరిశీలించి, పోలీస్ సిబ్బందికి, రెవెన్యూ సిబ్బందికి వరద తగ్గిన తర్వాతనే ప్రజలు దాటేందుకు అనుమతి ఇవ్వాలని వరద అధికంగా ఉన్న సమయంలో రాకపోకలు నిలిపి వేయాలని, భద్రత చర్యలకు సంబంధించిన సామాగ్రి అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.రానున్న నాలుగు రోజుల పాటు జిల్లాలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అత్యవసరం అయితే తప్ప బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా వాగులు, వంకలు, చెరువులు, నదులు, కల్వర్టులు, లో-లెవల్ బ్రిడ్జిల వద్దకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తున్న ప్రాంతాల్లో ప్రయాణాలు చేయవద్దని, పోలీసు శాఖ ప్రజల భద్రత కోసం వరద ప్రభావిత ప్రాంతాలు, లో-లెవల్ బ్రిడ్జిల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఏదైనా అత్యవసర పరిస్థితి ఎదురైతే వెంటనే డయల్--100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించి పోలీసు సేవలను వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ కోరారు.

**ప్రజలకు పోలీసు శాఖ సూచనలు**

- ఉధృతంగా ప్రవహిస్తున్న నీటిలోకి ఎట్టి పరిస్థితుల్లోనూ దిగవద్దు.- చేపల వేట కోసం వాగులు, చెరువులు, నదుల వద్దకు వెళ్లవద్దు. - నీటిలో మునిగిపోయిన కల్వర్టులు, వంతెనలు లేదా వాగులను దాటేందుకు ప్రయత్నించవద్దు. - పశువులను మేతకు తీసుకెళ్లే వారు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలి. - విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన విద్యుత్ తీగలకు దూరంగా ఉండి వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలి. - వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు నీటి ప్రవాహాలు, విద్యుత్ తీగల విషయంలో అప్రమత్తంగా ఉండాలి.
- శిథిలావస్థలో ఉన్న లేదా కూలిపోయే ప్రమాదం ఉన్న ఇళ్లలో నివసించవద్దు. - అత్యవసరం కాని దూర ప్రయాణాలను వాయిదా వేసుకోవడం మంచిది. - వాహనాల్లో అనుమతించిన పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దు. - సెల్ఫీలు, రీల్స్ లేదా ఇతర వినోదాల కోసం వరద ప్రాంతాలు, వాగులు, చెరువులు, జలపాతాల వద్దకు వెళ్లి ప్రాణాలను ప్రమాదంలో పెట్టుకోవద్దు.

జిల్లా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి పోలీసు శాఖ, రెవెన్యూ శాఖ మరియు ఇతర ప్రభుత్వ శాఖల సూచనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# అనాథ చిన్నారులకు అండగా నిలిచిన మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప...

సిర్పూర్ కాగజ్‌నగర్ ప్రతినిధి, జూలై 29 (ప్రజావీక్షణం న్యూస్):



కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలం అంబగట్ట గ్రామపంచాయతీ పరిధిలోని రేచిని గ్రామానికి చెందిన ఆదె భీమ్రావు, తిరుపతమ్మ దంపతులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో వారి పిల్లలు అనాథలుగా మారారు. ఈ విషాద ఘటన గురించి తెలుసుకున్న సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప బుధవారం రేచిని గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కోనేరు కోనప్ప మాట్లాడుతూ, అనాథ చిన్నారుల భవిష్యత్తుకు బాసటగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. చిన్నారి విద్యాభ్యాసానికి బీఆర్ఎస్ పార్టీ తరఫున నెలకు రూ.2,000 చొప్పున 50 నెలల పాటు మొత్తం రూ.1 లక్షల స్కాలర్‌షిప్ అందజేస్తామని ప్రకటించారు. పిల్లలను ఉన్నత చదువులు చదివించి మంచి స్థాయికి తీసుకెళ్లాలని కుటుంబ సభ్యులకు సూచించారు. అంతేకాకుండా, బాలిక విద్య పూర్తయిన అనంతరం ఆమె వివాహానికి అయ్యే పూర్తి ఖర్చును తానే భరిస్తానని హామీ ఇచ్చారు. అవసరమైన ప్రతి సందర్భంలోనూ బాధిత కుటుంబానికి పార్టీ తరఫున అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

Printed & published owned by K.SRAVAN KUMAR. Printed Published RK PRINTING PRESS at 6-1-948 Boyawada Street Nalgonda.Pin : 508001. Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. RNI.NO.APTEL/2009/29433.(CELL ) 9866330400 prajaveekshanam@gmail.com

ప్రజావీక్షణం దినపత్రిక
GENERAL NEWS
30 గురువారం, జులై 2026
www.prajaveekshanam.in


# కనీస వేతనాలు పెంచాలని కోరుతూ విజయవాడలో కలెక్టరేట్ ముట్టడికి సిఐటియు పిలుపు

**జుజ్జూరు, జులై 29 (ప్రజా వీక్షణం):**

"ధరలన్నీ పెరిగిపోయిన మన జీతం పెరగదా? చాలీచాలని జీతాలతో ఇంకా ఎంత కాలం బతుకుదాం?" అంటూ వీరులపాడు మండలం జుజ్జూరులోని విశాఖ రేకుల ఫ్యాక్టరీలో మరియు నరసరావుపేట స్వస్తిక్ రేకుల ఫ్యాక్టరీలలో సిఐటియు నాయకులు కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు ఎన్.సి.హెచ్. సుప్రజ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 66 రంగాల్లో ప్రైవేట్ యజమానుల వద్ద పనిచేస్తున్న 50 లక్షల మంది కార్మికులకు మనం ఎన్నుకున్న ప్రభుత్వాలే అన్యాయం చేస్తున్నాయని మండిపడ్డారు. చట్ట ప్రకారం ఐదు సంవత్సరాలకొకసారి వేతనాలు పెంచి యజమానుల చేత చెల్లింప చేయాల్సిన ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు కూర్చున్నాయని ధ్వజమెత్తారు. 2012 నుండి 2022 సంవత్సరాల మధ్య కనీస వేతనాలను పెంచకుండా యజమాన్యాలకు రాష్ట్ర ప్రభుత్వం వేలాది కోట్ల రూపాయల లాభం చేకూర్చి కార్మికులకు తీవ్ర నష్టం చేసిందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జీవోలను సవరించి కనీస వేతనం రూ.26,000 కు తగ్గకుండా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. మన జీతాలు పెరగకపోయినా ధరలు మాత్రం రోజురోజుకి పెరుగుతూనే ఉన్నాయని, దీనివలన చాలీచాలని జీతాలతో జీవనం గడపడం కోసం అధిక వడ్డీలకు అప్పులు చేసి బతకాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వీడీఏ ఉన్నాసరే అది పెరిగిన ధరలను పూర్తిగా భర్తీ చేయదని, కుటుంబ భారాలు కాలం గడిచే కొద్దీ పెరుగుతాయని తెలిపారు. అలాగే, కేంద్ర ప్రభుత్వం మనకు ఉన్న 29 కార్మిక చట్టాలను నిరంకుశంగా రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ లను తెస్తే.. మన రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇతర రాష్ట్రాల కంటే ముందే నిబంధనలను రూపొందించి కార్మికులకు తీరని ద్రోహం చేసిందని, దీనికి ప్రతిపక్ష వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కూడా వంత పాడిందని విమర్శించారు. యాజమానులకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మికులకు ద్రోహం చేయడంలో అధికార, ప్రతి



పక్ష పార్టీలు ఒకే విధానాన్ని అవలంబిస్తున్నాయని తేటతెల్లమైందని అన్నారు. 8 గంటలు మించి చేసిన పనికి చట్ట ప్రకారం ఓవర్ టైమ్ (డబుల్ వేతనాలు) ఇవ్వకుండా సంవత్సరానికి ఎంతో కొంత ఇంక్రిమెంట్ పేరుతో మొఖాన పడేస్తున్నారని దుయ్యబట్టారు. లేబర్ అధికారులు తనిఖీలకు పోకుండా ప్రభుత్వం కట్టడి చేయడంతో యజమానులు ఆడింది ఆటగా సాగుతోందని, దీన్ని ఇకమీదట సాగనివ్వబోమని హెచ్చరించారు. వేతనాల పెంపు కోసం పోరాడుదామని, సిఐటియు ఎప్పుడూ కార్మికులకు అండగా ఉంటుందని సుప్రజ భరోసానిచ్చారు. ఈ నేపథ్యంలోనే జులై 30వ తేదీ ఉదయం 10 గంటలకు విజయవాడలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో కార్మికులంతా పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు గోపినాయక్, చాట్ల రవి, షేక్ గౌస్, సుందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# కొయ్యలగూడెం పట్టణంలో టీడీపీ "ఇంటింటికి తెలుగుదేశం" ప్రచారం మరియు సమీక్షా సమావేశం

**ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి మరియు సంక్షేమ పథకాలను ప్రజలకు గడపగడపకూ చేరవేస్తూ కీలక పాత్ర పోషించిన అరుణ కుమారి.**

**కొయ్యలగూడెం జులై 29:(ప్రజా వీక్షణం)**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, పోలవరం నియోజకవర్గం కొయ్యలగూడెం పట్టణంలో "ఇంటింటికి తెలుగుదేశం పార్టీ" డోర్-టు-డోర్ ప్రచార కార్యక్రమం అత్యంత ఉత్సాహంగా కొనసాగింది. కొయ్యలగూడెం పట్టణంలోని 217, 218, 219, 220 బూత్‌ల పరిధిలో స్థానిక నాయకులతో కలిసి ఏలూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షురాలు ఆకుల అరుణ కుమారి ఈ ప్రచారంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి మరియు సంక్షేమ పథకాలను ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని పార్టీ శ్రేణుల్లో జోష్ నింపారు.పార్టీ కేంద్ర కార్యాలయం ఆదేశాల మేరకు ప్రతి నెల నాలుగో బుధవారం నిర్వహించే కార్యక్రమాల్లో భాగంగా, ఏలూరు పార్లమెంట్ టీడీపీ కార్యాలయంలో పార్లమెంట్ స్థాయి సమీక్షా సమావేశం ఘనంగా జరిగింది. ఏలూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి జగ్గవరపు ముత్తా రెడ్డి అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఏలూరు పార్లమెంట్ కమిటీ కార్యవర్గ సభ్యులు, ఆకుల అరుణ కుమారి తదితరులు పాల్గొని పార్టీ బలోపేతం, సంస్థాగత నిర్మాణం మరియు భవిష్యత్ కార్యాచరణపై లోతుగా చర్చించారు. రాబోయే కాలంలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు.



# మాతా, శిశు మరణాలపై కలెక్టర్ వెట్రిసెల్వి ఆగ్రహం...



## డాక్టర్ల నిర్లక్ష్యం తేలితే కఠిన చర్యలు -- ఏలూరు కలెక్టర్ కె. వెట్రిసెల్వి హెచ్చరిక!

## ఏలూరు జిల్లాలో కలకలం రేపుతున్న మాతా, శిశు మరణాలు -- డెత్ ఆడిట్‌కు కలెక్టర్ ఆదేశం!

**ఏలూరు, జులై 29(ప్రజా వీక్షణం )**

ఏలూరు జిల్లాలో మాతా, శిశు మరణాలపై సమగ్ర విచారణ చేసి, డాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా మరణాలు సంభవించాయని తేలితే సంబంధిత వైద్యాధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి హెచ్చరించారు. స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యసేవలు, మాతా, శిశు మరణాల నివారణ, సీజనల్ వ్యాధుల నియంత్రణ తదితర అంశాలపై అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ, జిల్లాలో ఏప్రిల్ నుంచి జూన్ వరకు 5 మాతృ మరణాలు, 41 శిశు మరణాలు సంభవించాయని వెల్లడించారు. ప్రతీ మాతా, శిశు మరణంపై తప్పనిసరిగా డెత్ ఆడిట్ జరగాలని స్పష్టం చేశారు. వీటిపై సమగ్ర విచారణ చేపట్టి, డాక్టర్లు మరియు సిబ్బంది వైద్య సేవా లోపం కారణంగానే మరణాలు సంభవించాయని తేలితే బాధ్యులపై వేటు తప్పదని హెచ్చరించారు. మాతా, శిశు మరణాలను నియంత్రించేందుకు గర్భిణీలకు గర్భం దాల్చిన దగ్గరి నుంచి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. అంగన్వాడీ, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు గర్భిణీలు, పుట్టిన పిల్లల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. పౌష్టికాహార లోపం, రక్తహీనత వంటి సమస్యలను గుర్తిస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా హై రిస్క్ ప్రెగ్నెన్సీ కలిగిన మహిళల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

### గర్భిణీలకు పోషకాహారలోపం లేకుండా మెగా ఫీడ్ నిర్వహణ:

జిల్లాలో ముఖ్యంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాలలో గర్భిణీలు సరైన పోషకాహారం అందక రక్తహీనత వంటి ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని కలెక్టర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆ సమస్యలను అధిగమించేందుకు జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలలో 3 నెలల పాటు వారంలో రెండు లేదా మూడు రోజులు పౌష్టికాహారం అందించేలా "మెగా ఫీడ్" కార్యక్రమాన్ని నిర్వహించాలని ఐసీడీఎస్, వైద్య శాఖ అధికారులను ఆదేశించారు.



### సీజనల్ వ్యాధుల నియంత్రణపై పటిష్ట చర్యలు:

జిల్లాలో మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ, కోవిడ్ వంటి వ్యాధులు ప్రబలకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాలలో ప్రజలు జ్వరం వస్తే ఆర్ఎంపీలను ఆశ్రయిస్తారని, వారి చికిత్స ఒక్కోసారి ప్రాణాంతకం అవుతుందని హెచ్చరించారు. ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఇటువంటి ఘటనలు గుర్తిస్తే వెంటనే జిల్లా అధికారులకు తెలియజేయాలన్నారు. విష జ్వరాలు ప్రబలకుండా ఫాగ్గింగ్ చేయించాలని, అంటువ్యాధుల పట్ల గిరిజన ప్రాంతాల ప్రజలకు తగిన ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వైద్యాధికారులను ఆదేశించారు.

### ఆసుపత్రుల సేవలలో ప్రజల సంతృప్తి స్థాయి పెంపు:

ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలపై సంతృప్తి స్థాయిని మరింత పెంచేలా వైద్యాధికారులు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ముదినేపల్లి మండలం దేవపూడి ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలకు గాను 90 శాతానికి పైగా ప్రజల సంతృప్తి స్థాయి సాధించడంపై సంబంధిత వైద్య సిబ్బందిని కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.ఈ సమీక్షా సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ శోభ, డీసీహెచ్ఎస్ బేబీ కమల, ఐసీడీఎస్ పీడీ శారద, బాలల సంరక్షణాధికారి సీహెచ్. సూర్యచక్రవేణి, జిల్లాలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు పాల్గొన్నారు.

# సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన జీడబ్ల్యూ ఎంసీ కమిషనర్

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జులై 29 (ప్రజా వీక్షణం న్యూస్)**

జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న బుధవారం కాశీబుగ్గ సర్కిల్ కార్యాల యాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. బర్త్ అండ్ డెత్, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాల పనితీరును పరి శీలించి రికార్డులను తనిఖీ చేశారు. కార్యాలయ ఆవర ణ గోడలపై స్వచ్ఛ భారత్ సందేశాలను ప్రతిబింబించే రంగుల చిత్రాలు వేయిం చాలని అధికారులను ఆదేశించారు. అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతం గా విధులు నిర్వహించాల ని సూచించారు.





# గురు పౌర్ణమి పర్వదినాన ప్రజలకు ఏఎంసీ డైరెక్టర్, జనసేన నాయకులు జట్లా సత్యనారాయణ హృదయపూర్వక శుభాకాంక్షలు!

**ఏలూరు జిల్లా, టి. నర్సాపురం: జులై 29(ప్రజా వీక్షణం)**

పవిత్ర గురు పౌర్ణమిని పురస్కరించుకుని ఏలూరు జిల్లా టి. నర్సాపురం మండలానికి చెందిన ప్రముఖ జనసేన నాయకులు, ఏఎంసీ డైరెక్టర్ జట్లా సత్యనారాయణ మండల ప్రజలకు, జనసైనికులకు, పార్టీ అభిమానులకు ఘనంగా గురు పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. అజ్ఞానాన్ని తొలగించి సన్మార్గంలో నడిపించే గురువులందరికీ ఆయన ఈ సందర్భంగా ప్రత్యేక నమస్కారాలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజ నిర్మాణంలో గురువుల పాత్ర ఎనలేనిదని, ప్రతి ఒక్కరి జీవితంలోనూ గురువు మార్గదర్శకత్వం ఎంతో కీలకమని పేర్కొన్నారు. అలాగే, ప్రజా సేవయే పరమార్థంగా ముందుకు సాగుతున్న జనసేన పార్టీ అధినాయకత్వం తమకు ఆదర్శప్రాయమైన గురువులని కొనియాడారు. టి. నర్సాపురం మండల సర్వతోముఖాభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి తాను నిరంతరం కట్టుబడి ఉంటానని ఆయన పునరుద్ఘాటించారు. గురు పౌర్ణమి స్ఫూర్తితో మండల ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని మనసారా ఆకాంక్షించారు.

# ఇంటింటికి తెలుగుదేశం: అభివృద్ధి, సంక్షేమాల జోరుతో కళకళలాడుతున్న రాజుపోతేపల్లి !




## టి.నర్సాపురం మండలంలో ఘనంగా 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమం

### రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి - సంక్షేమం ధ్యేయంగా కూటమి ప్రభుత్వ పాలన

**టి. నర్సాపురం జులై 29(ప్రజా వీక్షణం)**

రాష్ట్ర ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, ఏలూరు జిల్లా పోలవరం నియోజకవర్గం టి.నర్సా పురం మండలం రాజుపోతేపల్లి గ్రామంలో 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమం అత్యంత ఉత్సాహంగా మరియు ఘనంగా నిర్వహించ బడింది. టి.నర్సా పురం మండల తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు దావులూరి సూర్య నారాయణ మరియు తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు మద్దిపాటి కనకదుర్గారావు సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కొనసాగింది. గ్రామంలోని ప్రతి ఇంటికీ తిరుగుతూ కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో సాధించిన అభివృద్ధి మరియు సంక్షేమ ఫలాలను నాయకులు ప్రజలకు క్షుణ్ణంగా వివరించారు. ఈ సందర్భంగా ప్రజలకు అందుతున్న పథకాలైన 'తల్లికి వందనం', పింఛన్లు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు వంటి సంక్షేమ పథకాల గురించి లబ్ధిదారులు తమ స్వయా మాటల్లో వివరిస్తూ ప్రభుత్వాన్ని అభినందించడం మరియు సంతోషాన్ని వ్యక్తం చేయడం చాలా ఆనందంగా ఉందని నాయకులు పేర్కొన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా సాగుతున్న ఈ కూటమి ప్రభుత్వ పాలన పట్ల ప్రజల నుంచి అపూర్వమైన స్పందన లభిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజుపోతేపల్లి పార్టీ ప్రెసిడెంట్ మద్దిపాటి కనకదుర్గా రావు, మండల పార్టీ ఉపాధ్యక్షులు దావులూరి సూర్యనారాయణ, బూత్ కన్వీనర్ ముసునూరి బాలస్వామి, గౌరీ శంకర్, చిలకా బాలయ్య , నత్త నాగరాజు , తాడేపల్లి బాలస్వామి, మందపాటి జానరాజు, అందుగుల గాంధీ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# నందిగామ రైతు బజార్ హమాలీ కార్మికులకు కనీస వేతనం రూ. 26,000 ఇవ్వాలి : సీఐటీయూ డిమాండ్

**నందిగామ, జూలై 29 (ప్రజా వీక్షణం):**

నందిగామ రైతు బజార్‌లో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు కనీస వేతనం రూ. 26,000 చెల్లించాలని సీఐటీయూ నందిగామ మండల కార్యదర్శి కట్టారపు గోపాల్ డిమాండ్ చేశారు. బుధవారం నందిగామ రైతు బజార్ వద్ద కార్మికులతో కలిసి సమావేశం నిర్వహించి, జూలై 31వ తేదీన తలపెట్టిన కలెక్టరేట్ ముట్టడికి సంబంధించిన వాల్ పోస్టర్లు మరియు కరపత్రాలను కార్మికులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిత్యం కష్టపడి పనిచేస్తున్న రైతు బజార్ హమాలీ కార్మికుల సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరించిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులకు కేవలం కనీస వేతనం రూ. 26,000 ఇవ్వడమే కాకుండా, వారికి ప్రత్యేకంగా ప్రమాద బీమా (యాక్సిడెంట్ ఇన్సూరెన్స్) మరియు ఆరోగ్య బీమా (హెల్త్ ఇన్సూరెన్స్) సౌకర్యాలను కల్పించాలని ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు బజార్ హమాలీ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలిపారు.



# ప్రధానోపాధ్యాయుల పాత్ర కీలకం అదనపు కలెక్టర్ శేషాద్రి

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జులై 29 (ప్రజా వీక్షణం న్యూస్)**

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రధానోపాధ్యా యులే బలమైన ఆధారమ ని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శేషాద్రి అన్నారు. భీమారంలోని స్కిల్ స్టార్క్ పాఠశాలలో వివిధ మండలాల ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యా యులకు నిర్వహిస్తున్న మూడు రోజుల సేవాకాల శిక్షణను ఆయన ప్రారంభిం చారు. విద్యార్థుల సమగ్ర వికాసానికి కృషి చేయడం తో పాటు కృత్రిమ మేధ (ఆ×) వంటి ఆధునిక సాంకే తికతను బోధనలో విని యోగించి నాణ్యమైన విద్య అందించాలని సూచించారు.



# వైఎస్సార్ నగర్ గుడిసెల కూల్చివేతపై బీజేపీ ఆందోళన

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జులై 29 ( ప్రజా వీక్షణం న్యూస్)**

కాజీపేట వైఎస్సార్ నగర్ లో పేదల గుడిసెల కూల్చి వేతను బీజేపీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి రావు పద్మరెడ్డి ఖండించారు. బాధితులను పరామర్శిం చిన ఆమె, పునరావాసం, పరిహారం అందే వరకు బీజేపీ వారి పక్షాన పోరా డుతుందని హామీ ఇచ్చా రు. ఘటనపై అధికార యంత్రాంగం స్పందించాల ని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.





# జిల్లాలో టూరిజం ప్రాజెక్టులు మొదలు పెటట్ండి

### వచ్చే ఏడాదికి అందుబాటులోకి ఏఎంసీ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రాజెక్టు

### పున్నమి ఘాట్, ఫెర్రీ ఘాట్, బసవ పున్నయ్య స్టేడియంలో 'విజయవాడ ఉత్సవ్'

### ఇబ్రహీంపట్నం పవిత్ర సంఘం వద్ద ప్లాట్‌ఫాం నిర్మాణం చేపట్టాలి

### పర్యాటక అభివృద్ధితో జిల్లా ఆర్థికాభివృద్ధికి మరింత ఊతం

### జిల్లా కలెక్టర్ డా.లక్ష్మీశ

**విజయవాడ,జూలై29( ప్రజా వీక్షణం ):**

జిల్లాలో ప్రతిపాదించిన పర్యాటక ప్రాజెక్టులు డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టుల (డీపీఆర్) దశలోనే నిలిచిపోకుండా వేగవంతంగా గ్రౌండింగ్ చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ డా. లక్ష్మీశ సంబంధిత అధికారులను ఆదేశించారు. పర్యాటక రంగ అభివృద్ధి ద్వారా జిల్లాకు ఆర్థికంగా, ఉపాధి పరంగా విశేష ప్రయోజనం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్‌లోని ఏపీఎస్ రెడ్డి సమావేశ మందిరంలో గురువారం జిల్లా పర్యాటక ప్రోత్సాహక కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ డా.లక్ష్మీశ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో అమలవుతున్న పర్యాటక ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. భవానీ ఐలాండ్ వద్ద రూ.75 కోట్ల అంచనా వ్యయంతో ఐదు నుంచి పది ఎకరాల విస్తీర్ణంలో ప్రతిపాదించిన ఏఎంసీ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రాజెక్టుకు అవసరమైన అన్ని అనుమతులను త్వరితగతిన పొందాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. డెస్టినేషన్ వెడ్డింగ్, వాటర్ స్పోర్ట్స్, బోటింగ్, 500 మంది సామర్థ్యంతో కన్వెన్షన్ హాల్ తదితర ఆధునిక సౌకర్యాలతో ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. జూలై-2027 నాటికి ఈ ప్రాజెక్టును పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. భవానీ ఐలాండ్‌లో అమరావతి బోటింగ్ క్లబ్‌ను పర్యాటకులకు ఆకర్షణీయంగా, భద్రతా ప్రమాణాలతో నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. బోటింగ్ కార్యకలాపాల నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ మరిన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. స్వరాజ్ మైదానంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కళావేదికలో 75 మంది సామర్థ్యంతో మినీ థియేటర్‌ను పాఠశాల, కళాశాల విద్యార్థులకు విద్యా, వైజ్ఞానిక, అవగాహన చిత్రాల ప్రదర్శనకు వినియోగించాలన్నారు. ఇబ్రహీంపట్నంలోని పవిత్ర సంఘం వద్ద నదీహారతి కార్యక్రమాలను మరింత వైభవంగా నిర్వహించేందుకు వైదిక కమిటీ సూచనల మేరకు 30 డిగ్రీల డైమెన్షన్‌లో ప్రత్యేక ఎ÷-లాట్‌ఫాంను నిర్మించాలని ఆదేశించారు. అలాగే భక్తులకు అవసరమైన ఇతర మౌలిక వసతులను కూడా ఏర్పాటు చేయాలని కనకదుర్గ అమ్మవారి దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. రాకపోకలకు అనుగుణంగా రోడ్డు అభివృద్ధికి అవసరమైన బ్జడెట్ ప్రతిపాదనలను ఆర్ అండ్ బి అధికారులు తయారు చేయాలని సూచించారు. నదిహారతి సాయంత్రం 6 గంటలకు నిర్వహించనున్నందున సాయంత్రం నాలుగు గంటల నుండి 6 గంటల మధ్య ఆర్టీసీ బస్సులను ఆ రూట్ లో నడపాలని సూచించారు. విద్యుత్ కేబుల్స్ ఏర్పాటుకు జల వనరుల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గత ఏడాది విజయవంతంగా నిర్వహించిన 'విజయవాడ ఉత్సవ్' కార్యక్రమాన్ని ఈ ఏడాది కూడా నవరాత్రుల సందర్భంగా పున్నమి ఘాట్, ఫెర్రీ ఘాట్, బసవ పున్నయ్య స్టేడియంలో నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. పర్యాటకులు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సదుపాయాలు కల్పించాలని చెప్పారు. జిల్లాలో పర్యాటక ఆకర్షణగా ఉన్న సిబార్ డిస్నీల్యాండ్ పునరుద్ధరణకు అవసరమైన చర్యలు చేపట్టి తిరిగి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక 'ప్రసాద్' పథకం ద్వారా లభించే నిధులను జిల్లాలోని ప్రధాన దేవాలయాల అభివృద్ధికి వినియోగించేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. కొండపల్లి ఖిల్లాను అడ్వెంచర్ టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ట్రెక్కింగ్, ర్యాపెల్లింగ్ వంటి సాహస క్రీడలకు అవసరమైన బేస్ క్యాంపును జూలై 7 నుండి 11 వరకు ఏర్పాటు చేయడంతో పాటు, శాశ్వత టికెటింగ్ కౌంటర్‌ను ఏర్పాటు చేసి ట్రెక్కింగ్‌కు అవసరమైన సామగ్రిని పర్యాటకులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. పర్యాటక రంగంలో సమన్వయంతో ముందుకు సాగాలని అన్నారు. జిల్లాలో ప్రతిపాదించిన ప్రతి పర్యాటక ప్రాజెక్టు నిర్ణీత గడువులో పూర్తయ్యేలా సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డా. లక్ష్మీశ స్పష్టం చేశారు. పర్యాటక అభివృద్ధి ద్వారా జిల్లాకు మరింత ఆదాయం, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, విజయవాడను ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పర్యాటక శాఖ రీజినల్ డైరెక్టర్ వై.వి. ప్రసన్నలక్ష్మి, జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎ.శిల్ప, జిల్లా అటవీశాఖ అధికారి ఏ.సతీష్, ఏపీటీడీసీ ఈఈ జి.శ్రీనివాసరావు, శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వారి దేవస్థానం ఏఈఓ ఎన్.రమేష్, ఏఈ రమ, అమరావతి బోటింగ్ ప్రాజెక్ట్ సీఈవో కాకాని తరుణ్, బీఐటీసీ ప్రాజెక్టు ఇంజనీర్ జి.ఉమామహేశ్వరరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

# క్రీడలు మానసిక వికాసానికి, ఉత్సాహానికి దోహదం చేస్తాయి

### ఉద్యోగులు ప్రతిరోజూ ఏదో ఒక క్రీడకు సమయం కేటాయించాలి

### క్రీడా పరికరాల ప్రదర్శనను సందర్శించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ

**విజయవాడ,జూలై29( ప్రజా వీక్షణం ):**

క్రీడలు ప్రతి ఒక్కరి జీవితంలో కీలక పాత్ర పోషిస్తాయని, శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసం, ఉత్సాహాన్ని పెంపొందిస్తాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగులు విధుల నిర్వహణలో ఎదురయ్యే మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు ప్రతిరోజూ కొంత సమయాన్ని ఏదో ఒక క్రీడకు కేటాయించాలని ఆయన సూచించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఇగ్నైట్ సెల్‌ను బుధవారం జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా క్రీడల అభివృద్ధి శాఖ ఏర్పాటు చేసిన క్రీడా పరికరాల ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కొన్ని ఇండోర్ క్రీడలను స్వయంగా ఆడి సిబ్బందిని, సందర్శకులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ, ఆదాయ వనరులను పెంపొందించే ఆవిష్కరణలు, ఆధునిక సాంకేతికతకు ప్రోత్సాహం కల్పించడం, యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం ద్వారా జిల్లాలో సమగ్ర అభివృద్ధికి దోహదపడే సమాచార వేదికగా ఇగ్నైట్ సెల్ పనిచేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 'ఒక కుటుంబం ? ఒక పారిశ్రామికవేత్త' అనే లక్ష్యంతో పారిశ్రామికాభి వృద్ధికి ప్రాధాన్యతనిస్తూ పలు కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. ప్రతి శాఖ సేవలను ప్రజలకు చేరువ చేసే సమాచార వేదిక ఇగ్నైట్ సెల్ ద్వారా ప్రతిరోజూ ఒక ప్రభుత్వ శాఖకు సంబంధించిన సేవలు, పథకాలు, కార్యక్రమాలు, ఆ శాఖ రూపొందించిన ఉత్పత్తులు, ప్రజలకు ఉపయోగపడే సమాచారాన్ని ప్రదర్శన రూపంలో అందుబాటులో ఉంచుతున్నామని కలెక్టర్ తెలిపారు. దీనివల్ల ప్రజలకు ప్రభుత్వ శాఖల పనితీరు, అవకాశాలు, సేవలపై ప్రత్యక్ష అవగాహన కలుగుతుందన్నారు. ఈరోజు జిల్లా క్రీడల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వివిధ క్రీడా పరికరాలు, క్రీడలకు సంబంధించిన సమాచారాన్ని ప్రత్యేకంగా ప్రదర్శనలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. క్రీడా శాఖ నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాలు, యువతకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలు, జిల్లాకు చెందిన క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సాధించిన విజయాలు, వారికి లభిస్తున్న ప్రోత్సాహకాలు వంటి అంశాలను ప్రదర్శనలో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. క్రీడలు శారీరక ఆరోగ్యాన్ని మాత్రమే కాకుండా మానసిక స్థైర్యం, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని కలెక్టర్ అన్నారు. ప్రతి ఉద్యోగి, ప్రతి విద్యార్థి తమ దైనందిన జీవితంలో క్రీడలను భాగం చేసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన, ఉత్సాహభరితమైన జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.

ప్రజాపక్షణం దినపత్రిక
SPORTS/ BUSINESS
30 గురువారం, జులై 2026
www.prajaveekshanam.in



# వన్డే ఫార్మాట్‌లో గిల్ మళ్లీ నంబర్ 1

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ తాజాగా విడుదల చేసిన వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత టెస్ట్, వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అదరగొట్టాడు. ఈ నెలలో ఇంగ్లండ్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌లో రెండు హాఫ్ సెంచరీలు సాధించిన గిల్.. ఒక స్థానం మెరుగుపరుచుకుని మళ్లీ నంబర్ 1 స్థానానికి చేరుకున్నాడు. ప్రస్తుతం గిల్ ఖాతాలో 801 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. 794 పాయింట్లతో న్యూజిలాండ్ ఆటగాడు డారిల్ మిచెల్ రెండో స్థానానికి పడిపోయాడు. భారత స్టార్లు విరాట్ కోహ్లీ (767), రోహిత్ శర్మ (758) వరుసగా మూడు, నాలుగు స్థానాల్లో కొనసాగుతున్నారు. టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్ విషయానికి వస్తే 15 ఏళ్ల బిహార్ కుర్రాడు వైభవ్ సూర్యవంశీ అద్భుతం చేశాడు. జింబాబ్వేతో జరిగిన మూడు టీ20ల సిరీస్‌లో అద్భుతంగా రాణించి 151 పరుగులు చేయడమే కాకుండా 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డును గెలుచుకున్నాడు. ఈ ప్రదర్శనతో ఏకంగా 230 స్థానాలు ఎగబాకిన వైభవ్, ప్రస్తుతం 536 రేటింగ్ పాయింట్లతో 48వ స్థానంలో నిలిచినట్లు న్యూస్18 ఇంగ్లీష్ కథనం పేర్కొంది. మరో భారత ఆటగాడు ఇషాన్ కిషన్ 910 పాయింట్లతో టీ20 ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. జింబాబ్వేపై 60 పరుగులతో అజేయంగా నిలిచిన భారత వైస్ కెప్టెన్ తిలక్ వర్మ రెండు స్థానాలు పైకి ఎగబాకి ఆరో స్థానానికి చేరుకోగా, నిరాశపరిచిన అభిషేక్ శర్మ ఒక స్థానం కోల్పోయి మూడో స్థానానికి పడిపోయాడు. టెస్టు బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో వెస్టిండీస్‌తో జరిగిన తొలి టెస్టులో అజేయంగా అర్ధశతకం సాధించిన పాకిస్థాన్ కొత్త కెప్టెన్ బాబర్ ఆజం నాలుగు స్థానాలు మెరుగుపరుచుకున్నాడు. బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో పాక్ బౌలర్ మహ్మద్ అబ్బాస్ తొమ్మిది స్థానాలు ఎగబాకి 17వ స్థానానికి చేరుకోగా, వెస్టిండీస్ పేసర్ జేడెన్ సీల్స్ ఐదు స్థానాలు మెరుగుపరుచుకుని 24వ ర్యాంకుకు చేరుకున్నాడు. విండీస్ బౌలర్ షమర్ జోసెఫ్ ఆరు స్థానాలు కిందకు పడిపోయాడు. టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో జింబాబ్వే ఫాస్ట్ బౌలర్ బ్లెస్సింగ్ ముజరబానీ 10 స్థానాలు ఎగబాకి 26వ స్థానానికి చేరుకున్నాడు. అయితే, భారత బౌలర్లు వరుణ్ చక్రవర్తి (మూడు స్థానాలు), జస్ప్రీత్ బుమ్రా (ఐదు స్థానాలు), అర్షదీప్ సింగ్ (ఎనిమిది స్థానాలు) తమ ర్యాంకులను కోల్పోయారు.





# సత్తా చాటిన హర్జిందర్ కౌర్, గుల్వీర్ సింగ్

కామన్వెల్త్ క్రీడల్లో హర్జిందర్ కౌర్, గుల్వీర్ సింగ్ రజతం గెలుచుకున్నారు. భారత బాక్సర్లు ముందంజ వేసి, మరిన్ని పతకాలను ఖాయం చేసుకున్నారు. గ్లాస్గో వేదికగా జరుగుతున్న కామన్వెల్త్ గేమ్స్‌లో ఆరవ రోజు భారత క్రీడాకారులు అద్భుతమైన ప్రదర్శన కనబరిచారు. ప్రతికూల పరిస్థితులను అధిగమించి వెయిట్‌లిఫ్టర్ హర్జిందర్ కౌర్, లాంగ్-డిస్టెన్స్ రన్నర్ గుల్వీర్ సింగ్ దేశానికి రెండు అత్యుత్తమ రజత పతకాలను అందించారు. అదే సమయంలో ముగ్గురు భారత బాక్సర్లు సెమీఫైనల్స్‌లోకి అడుగుపెట్టి, భారత్‌కు మరో మూడు పతకాలను ఖాయం చేశారు. మహిళల 69 కేజీల వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో 5 అడుగుల 3 అంగుళాల ఎత్తు ఉన్న హర్జిందర్ కౌర్ తన కెరీర్‌లోనే అత్యుత్తమ ప్రదర్శనను నమోదు చేసింది. ఆమె స్నాచ్ విభాగంలో ముందుగా 99 కేజీలు ఎత్తి ఆ తర్వాత దానిని 101 కేజీలకు మెరుగుపరుచుకుంది. క్లీన్ అండ్ జెర్క్‌లో కూడా 123 కేజీలు, 126 కేజీలు ఎత్తి గేమ్స్ రికార్డులను బద్దలు కొట్టింది. మొత్తంగా 227 కేజీల బరువును విజయవంతంగా ఎత్తి, భారత్‌కు వెయిట్‌లిఫ్టింగ్‌లో ఏడవ పతకాన్ని అందించింది. అయితే, కెనడాకు చెందిన షార్లెట్ సిమోనో మొత్తం 240 కేజీల బరువును ఎత్తి ఆధిపత్యం చెలాయించి స్వర్ణం గెలుచుకుంది. పురుషుల 10,000 మీటర్ల పరుగు పందెంలో ఆసియా క్రీడల కాంస్య పతక విజేత గుల్వీర్ సింగ్ సంచలనం సృష్టించాడు. భారీ వర్షం, ట్రాక్ నిండా నీరు ఉన్నప్పటికీ అద్భుతమైన పోరాట పటిమ కనబరిచాడు. 27 నిమిషాల 49.78 సెకన్ల వ్యవధిలో రేసును పూర్తి చేసి, స్వర్ణ పతక విజేత కై రాబిన్సన్ (27:48.93) కంటే కేవలం 0.85 సెకన్ల వెనుకంజలో నిలిచి రజత పతకం సాధించాడు. కామన్వెల్త్ గేమ్స్‌లో ఈ ఈవెంట్‌లో పతకం సాధించిన తొలి భారతీయుడిగా గుల్వీర్ సింగ్ సరికొత్త చరిత్రను లిఖించాడు. మహిళల 60 కేజీల విభాగంలో ఆసియా ఛాంపియన్ ప్రియా ఘంఘాస్ ఆతిథ్య క్రీడాకారిణి నియామ్ మిచెల్‌పై 4-1 తేడాతో అద్భుతమైన కమ్‌బ్యాక్ విజయాన్ని సాధించింది. 54 కేజీల విభాగంలో ప్రీతి పవార్ 5-0 తేడాతో నికోల్ క్లైడ్‌ను, పురుషుల 55 కేజీల విభాగంలో జదుమణి సింగ్ జాంబియా బాక్సర్‌ను మట్టికరిపించి సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లారు. దీని ద్వారా భారత్‌కు కనీసం 3 పతకాలు ఖరారయ్యాయి. క్వార్టర్ ఫైనల్స్‌లో పర్వీన్ హుడా (2-3), కపిల్ పోఖారియా (90 కేజీలు) తీవ్రంగా పోరాడి ఓటమి పాలయ్యారు. పురుషుల 400 మీటర్ల పరుగులో జాతీయ రికార్డ్ హోల్డర్ విశాల్ టీకే 46.49 సెకన్లలో తన లక్ష్యాన్ని చేరుకుని సెమీఫైనల్‌కు అర్హత సాధించాడు. 45 సెకన్ల లోపు పరుగెత్తిన తొలి భారతీయుడిగా (44.98 సెకన్లు) రికార్డు ఉన్న విశాల్, హీట్ సిక్స్‌లో రెండో స్థానంలో నిలిచి సెమీస్ చేరాడు. కామన్‌వెల్త్ గేమ్స్‌లో మహిళల 48 కేజీ వెయిట్‌లిఫ్టింగ్‌లో మీరాబాయి చాను గోల్డ్ గెలిచి, వరుసగా మూడోసారి కామన్‌వెల్త్ గోల్డ్ సాధించింది. ఇది ఆమెకు చారిత్రాత్మక హ్యాట్రిక్. ఐతే.. ఇది జులై 26న వచ్చిన గోల్డ్. జూలై 28న భారత్‌కు కొత్తగా గోల్డ్ మెడల్ రాలేదు.

# దులీప్ ట్రోఫీ 2026 ఈస్ట్ జోన్ జట్టు ప్రకటన

## జట్టు కెప్టెన్‌గా ఇషాన్ కిషన్ నియామకం

## వైస్ కెప్టెన్‌గా వైభవ్ సూర్యవంశీ ఎంపిక!



భారత ప్రతిష్టాత్మక దేశీయ క్రికెట్ టోర్నీమెంట్ అయిన దులీప్ ట్రోఫీ 2026 కోసం ఈస్ట్ జోన్ జట్టును ప్రకటించారు. యువ ఆటగాళ్లతో కూడిన ఈ జట్టుకు వికెట్ కీపర్-బ్యాటర్ ఇషాన్ కిషన్ కెప్టెన్‌గా వ్యవహరించగా.. 15 ఏళ్ల యువ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ వైస్ కెప్టెన్‌గా నియమితులయ్యారు. చిన్న వయసులోనే ఇలాంటి కీలక బాధ్యతను స్వీకరించడం.. మరో పాత్రలో తనను తాను నిరూపించుకోవడానికి వైభవ్ సూర్యవంశీకి ఓ అవకాశంగా నిలుస్తుంది. గత సంవత్సరం ప్రకటించిన తూర్పు జోన్ జట్టుకు ఇషాన్ కిషన్ కెప్టెన్‌గా ఎంపిక కాగా.. అతడికి ఇంతకు ముందు కూడా కెప్టెన్‌గా చేసిన అనుభవం కూడా ఉంది. గతేడాది ఇషాన్ కిషన్ ఫైనల్‌లో హర్యానాను 69 పరుగుల భారీ తేడాతో ఓడించి.. జార్ఖండ్‌కు వారి మొదటి సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ టైటిల్‌ను అందించాడు. పాట్ కమిన్స్ గైర్హాజరీలో ఇషాన్ కిషన్ ఐపీఎల్ 2026లోని మొదటి ఏడు మ్యాచ్‌లలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు కూడా నాయకత్వం వహించాడు.మరోవైపు 15 ఏళ్ల వయసులోనే వైభవ్ సూర్యవంశి వైస్ కెప్టెన్‌గా ఎంపిక కావడం ఈ జట్టుకు ఓ చెప్పుకోదగ్గ విజయం. వైభవ్ సూర్యవంశీ దక్షిణాఫ్రికా పర్యటనలో భారత అండర్-19 జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి సిరీస్ విజయాన్ని అందించాడు. వైభవ్ తన కొత్త బాధ్యతను ఎలా నిర్వహిస్తాడో చూడటం ఆసక్తికరంగా ఉంటుంది. భారత ఫాస్ట్ బౌలర్లు మహమ్మద్ షమీ, ముఖేష్ కుమార్‌లను బౌలింగ్ విభాగంలోకి చేర్చారు. ఈ ఇద్దరు బౌలర్లకు అంతర్జాతీయ క్రికెట్ అనుభవం ఉంది. వారి రాక జట్టు పేస్ బౌలింగ్ విభాగాన్ని బలోపేతం చేస్తుంది. 2027 ప్రపంచ కప్ జట్టులో షమీకి చోటు దక్కాలని కొంతమంది క్రికెట్ నిపుణులు భావిస్తున్నందున.. షమీ ప్రదర్శనను నిశితంగా గమనిస్తారు. అంతేకాకుండా ఈస్ట్ జోన్ జట్టులో అభిమన్యు ఈశ్వరన్ వంటి బ్యాటర్ కూడా ఉన్నాడు. షాబాజ్ అహ్మద్, అనుకుల్ రాయ్ వంటి ఆల్‌రౌండర్లు కూడా ఉన్నారు.

2026 దులీప్ ట్రోఫీకి ఈస్ట్ జోన్ జట్టు ఇషాన్ కిషన్ (కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ (వైస్ కెప్టెన్), అభిమన్యు ఈశ్వరన్, సుదీప్ కుమార్ ఘరామీ, షాబాజ్ అహ్మద్, సూరజ్ సింధు జైస్వాల్, మహమ్మద్ షమీ, ముఖేష్ కుమార్, కుమార్ కుశాగ్ర, శిఖర్ మోహన్, అనుకుల్ రాయ్, విరాట్ సింగ్, శుభ్రాంశు సేనాపతి, డానిష్ దాస్, అభిజిత్ సర్కార్

# వెస్టిండీస్ పర్యటనను పాకిస్థాన్ ఘోర పరాజయం

## వెస్టిండీస్ చేతిలో 90 పరుగుల తేడాతో పాకిస్థాన్ చిత్తు

## డబ్ల్యూటీసీ పాయింట్స్ టేబుల్‌లో పాతాళానికి పాక్

వెస్టిండీస్ పర్యటనను పాకిస్థాన్ ఘోర పరాజయంతో ప్రారంభించింది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2027లో భాగంగా జరుగుతున్న రెండు టెస్ట్‌ల సిరీస్‌లో పాకిస్థాన్ శుభారంభం చేయలేకపోయింది. మంగళవారం ముగిసిన తొలి టెస్ట్‌లో సమష్టిగా రాణించిన వెస్టిండీస్ 90 పరుగుల తేడాతో పాకిస్థాన్‌ను చిత్తు చేసింది.పూర్తిగా పేస్ ఆధిపత్యం నడిచిన ఈ మ్యాచ్‌లో ఫాస్ట్ బౌలర్లే 40 వికెట్లు పడగొట్టారు. 211 పరుగుల లక్ష్య ఛేదనలో పాకిస్థాన్ 120 పరుగులకే కుప్పకూలింది. వెస్టిండీస్ పేసర్ జైడెన్ సీల్స్(5/20) ఐదు వికెట్లతో పాక్ పతనాన్ని శాసించాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 311 పరుగులు చేయగా.. పాకిస్థాన్ 282 పరుగులకు ఆలౌటైంది.29 పరుగుల స్వల్ప ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన వెస్టిండీస్ 181 పరుగులకు ఆలౌటైంది. దాంతో పాక్ ముందు 211 లక్ష్యం నమోదు కాగా.. పాక్ ఛేదించలేకపోయింది. విదేశాల్లో పాకిస్థాన్‌కు ఇది వరుసగా 8వ ఓటమి. ఈ ఘోర పరాజయంతో డబ్ల్యూటీసీ పాయింట్స్ టేబుల్‌లో పాకిస్థాన్ పాతాళానికి పడిపోయింది.ఈ డబ్ల్యూటీసీ 2027 ఎడిషన్‌లో ఇప్పటి వరకు 5 టెస్ట్ మ్యాచ్‌లు ఆడిన పాక్.. ఒకే ఒక్క విజయం, 6.66 విన్నింగ్ పర్సంటేజీతో అట్టడుగు స్థానంలో నిలిచింది. వెస్టిండీస్ 11 మ్యాచ్‌ల్లో 2 విజయాలు, 22.73 విజయాల శాతంతో 8వ స్థానంలో కొనసాగుతోంది. భారత్ 9 మ్యాచ్‌ల్లో 4 గెలిచి, ఒకటి డ్రా చేసుకొని 48.15 విన్నింగ్ పర్సంటేజీతో ఐదో స్థానంలో నిలిచింది. 8 మ్యాచ్‌ల్లో 7 విజయాలు, 87.50 విన్నింగ్ పర్సంటేజీతో ఆస్ట్రేలియా అగ్రస్థానంలో ఉండగా..4 మ్యాచ్‌ల్లో మూడు విజయాలు, 75 విన్నింగ్ పర్సంటేజీతో సౌతాఫ్రికా రెండో స్థానంలో ఉంది. న్యూజిలాండ్ 6 మ్యాచ్‌ల్లో 4 విజయాలు, 72.22 విన్నింగ్ పర్సెంటేజీతో మూడో స్థానంలో కొనసాగుతుండగా.. 4 మ్యాచ్‌ల్లో 2 విజయాలు, 58.33 విజయాల శాతంతో నాలుగో స్థానంలో నిలిచింది. డబ్ల్యూటీసీ పాయింట్స్ టేబుల్‌లో భారత్ అగ్రస్థానంలో నిలవాలంటే శ్రీలంకతో రెండు టెస్ట్ సిరీస్‌లతో పాటు న్యూజిలాండ్, ఆస్ట్రేలియాపై విజయాలు సాధించాలి.

ప్రజావీక్షణం
దినపత్రిక




TRENDING

# 8న గ్రాండ్‌గా టాక్సిక్ ట్రైలర్ లాంచ్ ప్లాన్

యశ్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం 'టాక్సిక్: ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్‌అప్స్'. ఈ సినిమా నుంచి భారీ అప్‌డేట్ సిద్ధమైంది. 'టాక్సిక్' చిత్రబృందం ఆగస్టు 8న బెంగళూరులో గ్రాండ్‌గా ట్రైలర్ లాంచ్‌ను ప్లాన్ చేస్తోంది. ట్రైలర్ లాంచ్‌కి ముందు ప్రత్యేక మీడియా సమావేశం ఏర్పాటు చేసి దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ సినిమాకు సంబంధించిన ఆసక్తికర విషయాలు పంచుకోనున్నారు. యశ్‌తో పాటు ఐదుగురు హీరోయిన్లు హాజరుకానున్నారు. దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించేలా ఈ ఈవెంట్‌ను నిర్వహించాలని నిర్మాణ సంస్థ ఏర్పాట్లు చేస్తోంది. భారీ స్థాయిలో రానున్న ఈ చిత్రాన్ని కన్నడ, ఇంగ్లిష్ భాషల్లో ఒకేసారి చిత్రీకరించారు. ప్రపంచవ్యాప్తంగా 40కి పైగా భాషల్లో డబ్ చేసి విడుదల చేయనున్నారు. ఆగస్టు 26న 'టాక్సిక్' ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, టీజర్, పాటలు నెట్టింట వైరల్ కాగా.. ట్రైలర్‌తో సినిమా అంచనాలు రెట్టింపు చేయాలని టీమ్ భావిస్తోంది. ఈ సినిమాలో బలమైన ఎమోషన్స్ ఉన్నాయని యశ్ అన్నారు. థియేటర్‌లో అందరూ ఆశ్చర్యపోతారన్నారు. యాక్షన్ సినిమాలంటే తనకు ఎంతో ఇష్టమని.. 'టాక్సిక్'లో హాలీవుడ్ స్టంట్ కోఆర్డినేటర్ జేజే పెర్రీ రూపొందించిన యాక్షన్ సీక్వెన్సులు సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాయని తెలిపారు. ఇందులో ఈ రాకింగ్ స్టార్‌కు జోడీగా తారా సుతారియా, నయనతార, రుక్మిణి వసంత్, కియారా అద్వాణీ, హ్యూమా ఖురేషీ మెరవనున్నారు.

# రెండు భాగాలుగా అల్లు,అట్లీల రాకా మూవీ

## వేయికోట్ల బడ్జెట్‌తో ప్లాన్ చేస్తున్నట్లు ప్రచారం




టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న పాన్-వరల్డ్ ప్రాజెక్ట్ 'రాకా' సినిమాకు సంబంధించి ఓ సరికొత్త వార్త ఫిలింనగర్ సర్కిల్స్‌లో వైరల్ అవుతోంది. అనౌన్స్‌మెంట్‌తోనే భారీ అంచనాలను రేకెత్తించిన ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా సాగుతున్న సంగతి తెలిసిందే. అయితే ఈ సినిమాకు సంబంధించి తాజాగా ఒక క్రేజీ అప్‌డేట్ బయటకు వచ్చింది. మీడియా కథనాల ప్రకారం, 'రాకా' చిత్రాన్ని మేకర్స్ సింగిల్ పార్ట్‌గా కాకుండా రెండు భారీ భాగాలుగా తెరకెక్కించాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. అంతేకాకుండా ఈ రెండు భాగాలను కలిపి ఏకంగా రూ.1000 కోట్ల భారీ బడ్జెట్‌తో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నట్లు సమాచారం. ఈ రెండు భాగాలలోనూ ఇద్దరు స్టార్ ఏ ీ ా ంో ం ు ు న ు అలరించనున్నారు. ఒక భాగంలో అల్లు అర్జున్ సరసన బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకొణ్ నటిస్తుండగా, మరో భాగంలో టాలెంటెడ్ నటి మృణాల్ ఠాకూర్ ప్రధాన పాత్రలో కనిపించబోతున్నట్లు తెలుస్తుంది. ఇక కథాంశం విషయానికొస్తే, అట్లీ ఈ చిత్రాన్ని అత్యంత వైవిధ్యంగా ప్లాన్ చేశారు. ఒక పార్ట్‌ను పూర్తిగా హిస్టారికల్ బ్యాక్‌డ్రాప్ మరియు ఫాంటసీ ఎలిమెంట్స్‌తో తెరకెక్కిస్తుండగా, మరో పార్ట్‌ను పూర్తిగా భిన్నమైన ఫ్యూచరిస్టిక్ ప్రపంచంలో నడిచేలా రూపొందిస్తున్నారట. ఇందులో హిస్టారికల్ నేపథ్యంలో వచ్చే భాగంలో దీపికా పదుకొణ్ నటిస్తుందని తెలుస్తోంది. వీటితో పాటు ఈ చిత్రంలో బాలీవుడ్ బాద్షా షారుఖ్ ఖాన్ ఒక ప్రత్యేక అతిథి పాత్రలో కనిపించనున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఇప్పటికే అట్లీ దర్శకత్వంలో షారుఖ్ నటించిన 'జవాన్' బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించడంతో, ఈ చిత్రంలోనూ ఆయన నటిస్తే సినిమా స్థాయి మరింత పెరుగుతుందని అభిమానులు భావిస్తున్నారు.







# చకచకా స్పిరిట్ షూటింగ్ పూర్తి

## వందరోజుల్లో పూర్తి చేసేలా ప్లాన్

టాలీవుడ్ మోస్ట్ అవైటెడ్ కాంబినేషన్‌లో వస్తున్న హై-వోల్టేజ్ యాక్షన్ చిత్రం 'స్పిరిట్' గురించి ఓ ఆసక్తికరమైన వార్త ప్రస్తుతం ఫిలింనగర్ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతోంది. సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ప్యాన్-ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ సినిమా షూటింగ్‌ను కేవలం 100 రోజుల్లోనే పూర్తి చేయాలని దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. ప్రస్తుతం ప్రభాస్ ఇతర ప్రాజెక్ట్‌ల షూటింగ్స్‌లో సమాంతరంగా పాల్గొంటున్నప్పటికీ, 'స్పిరిట్' టీమ్ మాత్రం తమ ప్లానింగ్ పక్కాగా ఉండటంతో సినిమా అనుకున్న సమయానికే పూర్తవుతుందని పూర్తి విశ్వాసంతో ఉంది. మరోవైపు ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించి సుమారు 40 శాతం షూటింగ్ పూర్తయినట్లు సమాచారం. మిగిలిన మేజర్ షెడ్యూల్స్ ఎక్కువగా హైదరాబాద్‌లోనే జరగనున్నాయి. ఇదిలావుంటే సందీప్ టీమ్ ప్లానింగ్ వలన ప్రభాస్ చేస్తున్న అత్యంత తక్కువ బడ్జెట్ సినిమా ఇదేనని తెలుస్తుంది. గత దశాబ్ద కాలంలో ప్రభాస్ చేసిన భారీ బ్జడెట్ సినిమాలతో పోలిస్తే 'స్పిరిట్' అత్యంత తక్కువ బ్జడెట్‌తో రాబోతుందని ఇప్పటికే టాక్ కూడా బయటకు పాకింది. ఇక దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తనదైన మేకింగ్ స్టైల్‌తో ఈ చిత్రాన్ని మరింత పవర్‌ఫుల్‌గా తెరకెక్కిస్తు ఒడటంతో, బాక్సాఫీస్ వద్ద మరో సంచలనం సృష్టించడం ఖాయమని అభిమానులు ఆశిస్తున్నారు.

Printed & published owned by K.SRAVAN KUMAR. Printed Published RK PRINTING PRESS at 6-1-948 Boyawada Street Nalgonda.Pin : 508001. Head office: 2-66-121/122 near ramky one Marvel gajullararamaram Quthbulapur medchal Malkajgiri district. RNI.NO.APTEL/2009/29433.(CELL ) 9866330400 prajaveekshanam@gmail.com